'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 85 | మంగళవారం | 10.11.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 85 | Tuesday | 10.11.2026 | Pages: 8 | Rate: 2



## భాగ్యలక్ష్మి ఆలయంలో భక్తజన సందడి!

**ఖజానా వెండి నాణేల కోసం పోటెత్తిన భక్తులు**
**చార్మినార్ వద్ద ఆధ్యాత్మిక కోలాహలం..**
**మూడు రోజుల పాటు వెండి నాణేల పంపిణీ..**

దీపావళి పండుగ సందర్భంగా పాతబస్తీలోని చార్మినార్ సమీపంలో ఉన్న ప్రసిద్ధ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. అమ్మవారి వెండి నాణేలు 'ఖజానా' పంపిణీ కార్యక్రమం ప్రారంభం కావడంతో నగరంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. (**వివరాలు 2లో..**)



## జనగణన రెండో దశ ఖరారు

**ఇంటి వద్దకే అధికారుల రాక**
**జనవరి 10 నుంచి స్వీయ గణన**

తెలంగాణలో జనగణన 2027 రెండో దశకు రాష్ట్ర ప్రభుత్వం తేదీలను ప్రకటించింది. వచ్చే ఏడాది జనవరి 10 నుంచి 24 వరకు ప్రజలకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) చేసుకునే అవకాశం కల్పించనున్నారు. అనంతరం జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు అధికారులు ఇంటింటికీ వెళ్లి జనాభా వివరాలను సేకరిస్తారు. ఈ ప్రక్రియలో సేకరించిన వివరాల పరిశీలన, సవరణల కోసం మార్చి 1 నుంచి 5 వరకు రివిజనల్ రౌండ్ నిర్వహిస్తారు. (**వివరాలు 2లో..**)



## బియ్యం ధరల దోపిడీకి చెక్

**దళారుల ఆటలకు కళ్లెం!**
**మిల్లర్ల నుంచి నేరుగా రిటైలర్లకు సరఫరా**
**కొరత పేరుతో కృత్రిమ దందా..**
**దళారులపై నిఘా, అక్రమార్కులపై చర్యలు..**
**సామాన్యుడికి ధరల ఉపశమనం ఎప్పుడో?**

తెలంగాణలో పెరుగుతున్న బియ్యం ధరలకు అడ్డుకట్ట వేసేందుకు పౌరసరఫరాల శాఖ కొత్త విధానాన్ని ప్రకటించింది. ఇకపై బియ్యం మిల్లర్ల నుంచి స్థానిక రిటైలర్లకు నేరుగా సరుకును సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేయనుంది. (**వివరాలు 2లో..**)




7లో..

## బజార్లో డాక్ట'రేట్లు'

**అనర్హులకు పట్టా ప్రదానం..**

- దాని వెనుకుందో పకడ్బందీ యాపారం..!
- డబ్బుంటే చాలు.. డాక్టర్ పట్టా చేతిలో!

ఒకప్పుడు డాక్టరేట్ అందుకోవాలంటే ఏళ్ల తరబడి పరిశోధన చేయాలి. ఎన్నో పరీక్షలు ఎదుర్కోవాలి. అపారమైన విజ్ఞానం, అంకితభావం, నిరంతర శ్రమకు గుర్తింపుగా మాత్రమే ఆ గౌరవం దక్కేది. కానీ ఇప్పుడు సీన్ మారింది! పరిశోధనతో పనిలేదు.. ప్రతిభతో అవసరం లేదు.. పేరున్న విశ్వవిద్యాలయం కోసం వెతకాల్సిన పనీ లేదు! జేబులో డబ్బులుంటే చాలు.. గౌన్ వేసి, వేదికపైకి పిలిచి, చేతిలో సర్టిఫికెట్ పెట్టి, పేరుకు ముందు డాక్టర్ అనే బిరుదు తగిలించేస్తున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. విదేశీ యూనివర్సిటీల పేర్లు.. అంతర్జాతీయ సంస్థల ముసుగులు.. సోషల్ మీడియా ప్రకటనలు.. కమీషన్ ఏజెంట్లు.. వెరసి డాక్టరేట్ల చుట్టూ భారీ వ్యాపారం సాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చదవడం, రాయడం కూడా సరిగా రాని కొందరు డాక్టర్లుగా చెలామణి అవుతుంటే, ఏళ్ల తరబడి పరిశోధన చేసిన అసలైన విద్యావంతుల పరిస్థితి ఏమిటి? యూజీసీ గుర్తించిన 32 నకిలీ విశ్వవిద్యాలయాల వ్యవహారం.. పీహెచ్‌డీ విక్రయాలపై ఫిర్యాదులు.. వివిధ రాష్ట్రాల్లో వెలుగుచూస్తున్న మోసాలు ఈ దందా తీవ్రతను బయటపెడుతున్నాయి. అసలు డాక్టరేట్ ప్రదానం చేసే అధికారం ఎవరికి ఉంది? గౌరవ బిరుదు పేరుతో జరుగుతున్న వ్యాపారం వెనుక ఎవరున్నారు? నిజమైన ప్రతిభకు విలువ లేకుండా పోతోందా? బిరుదులు కొనుక్కోవచ్చు.. కానీ ప్రతిభను కొనగలరా?



3లో..

## పార్లమెంట్ చరిత్రలో కొత్త రికార్డు

**88 రోజులుగా ముగియని సమావేశాలు!**
**డీలిమిటేషన్ బిల్లుల కోసమేనా జాప్యం?**
**ప్రత్యేక సమావేశాలపై రాజకీయ ఉత్కంఠ**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసినా, అధికారికంగా ముగింపు పలకకపోవడం దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. లోక్‌సభ, రాజ్యసభలను ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా వేసినప్పటికీ, నవంబర్ 9 ఉదయం వరకు ప్రొరోగ్ చేయలేదు. దీంతో గతంలో 2008లో నమోదైన 87 రోజుల రికార్డును అధిగమించి 88 రోజుల సరికొత్త రికార్డు నమోదైంది.



## డీలిమిటేషన్ బిల్లుల కోసం కొత్త ఎత్తుగడ!

**లోక్‌సభ ప్రొరోగేషన్‌పై కాంగ్రెస్ ఆరోపణలు**
**మూడింట రెండొంతుల మెజారిటీ కోసమేనా?**
**అమిత్ షాపై జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు**

లోక్‌సభ నిరవధిక వాయిదా (సైన్ డై) పడినప్పటికీ, ఇప్పటివరకు సభను అధికారికంగా ప్రొరోగ్ చేయకపోవడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. డీలిమిటేషన్ బిల్లులను ఆమోదించేందుకు అవసరమైన లోక్‌సభలోని రెండు మూడొంతుల మెజారిటీని కూడగట్టుకునేందుకే కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఈ జాప్యం చేస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు.



## 34 నెలల్లో ₹ 2 లక్షల కోట్లు చెల్లించాం!

## బీఆర్ఎస్ అప్పులపై రేవంత్ నిప్పులు

» అప్పుల భారం మోస్తూనే అభివృద్ధి చేస్తున్నాం
» ఏటా రూ. 80 వేల కోట్లు అప్పులకే చెల్లింపు
» కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో.. మేం ప్రజల మధ్య

లగచర్లలో నిర్వహించిన 'రైతన్నతో ఆత్మీయ సభ'లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంపై రూ.8.11 లక్షల కోట్ల అప్పుల భారం మోపి కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ అప్పులు, తప్పుల కారణంగా ప్రతి సంవత్సరం రూ.80 వేల కోట్లు వడ్డీలు, అప్పుల చెల్లింపులకే కేటాయించాల్సి వస్తోందని వెల్లడించారు. తమ 34 నెలల పాలనలోనే రూ.2 లక్షల కోట్లకు పైగా పాత అప్పుల భారం చెల్లించామని తెలిపారు. తనకు అప్పులు చేసే అలవాటు లేదని, అబద్ధాలు చెప్పే స్వభావం అసలే లేదని స్పష్టం చేశారు. కేసీఆర్‌తో బహిరంగంగా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని, మాట్లాడటానికి రమ్మంటే ఆయన మాత్రం ముందుకు రావడం లేదని ఎద్దేవా చేశారు. తినే విషయంలో కుంభకర్ణుడు, పండే విషయంలో బకాసురుడని ఘాటైన వ్యాఖ్యలు చేశారు (**వివరాలు 2లో..**)

## కొడంగల్‌కు ₹ 9,053 కోట్ల అభివృద్ధి కానుక!

- ఒకేసారి 13 ప్రాజెక్టులకు సీఎం శంకుస్థాపనలు
- రూపురేఖలు మార్చే బృహత్తర ప్రణాళికలు

కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ నిధులు కేటాయించారు. లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో నిర్వహించిన రైతన్నతో ఆత్మీయ సభ సందర్భంగా మొత్తం రూ.9,053.48 కోట్ల అంచనా వ్యయంతో 13 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఇందులో అత్యధికంగా రూ.5,060 కోట్లతో కొత్తపల్లి గూడ నుంచి నాచారం వరకు రేడియల్ రోడ్డు-2 నిర్మాణం చేపట్టనున్నారు. ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ.1,410 కోట్లతో 223 కొత్త, అసంపూర్తి బీటీ రహదారుల పనులు చేపడతారు. రూ.2,100 కోట్లతో మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం రెండో దశ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టులు రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు సాగునీటి అవసరాలను తీర్చేందుకు దోహదపడనున్నాయి. కొడంగల్ ప్రాంతాన్ని అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పనులను చేపడుతోంది. (**వివరాలు 2లో..**)



3లో..

## ఇంధనంలో కల్తీ కలకలం

**67 చోట్ల పెట్రోల్ పరీక్షలు!**
**ఇథనాల్ మోతాదుపై కర్ణాటక సీరియస్**
**పెట్రోల్‌లో క్వాలిటీపై ఫిర్యాదులు**



## జనవరిలో ఎలక్షన్ షెడ్యూల్!

**ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల సందడి**
**నవంబర్ చివరి నుంచి ఈసీ కసరత్తు**
**సంక్రాంతికి ముందే మోగనున్న నగారా!**

**కేటీఆర్‌కు గడ్డం పెరిగినా రేవంత్ కాలేరు..**
**లగచర్లలో పారిశ్రామిక విప్లవానికి శ్రీకారం**
పారిశ్రామిక కారిడార్‌తో కొడంగల్‌కు కొత్త దిశ

**డిసెంబర్‌లో కొడంగల్‌కు కృష్ణా జలాలు!**
ఎత్తిపోతల పనులకు వేగం పెంచుతాం..
ఎవరు అడ్డొచ్చినా ప్రాజెక్టులు ఆగవు..
వలసల జిల్లాకు సాగునీటి భరోసా..
పాలమూరు రైతులకు సీఎం హామీ..

**ప్రజాబలంతో రాజకీయ సునామీ సృష్టిస్తా**
సంక్రాంతి తర్వాత ప్రజల్లోకి వస్తానన్న సీఎం




2లో..

## గ్రామాలకు చేరువైన 4జీ ఇంటర్నెట్

**నాలుగేళ్లలో 4జీ లేనివి 75 % తగ్గుదల**
**45,180 నుంచి 11,372కు పడిపోయిన సంఖ్య**
**బీఎస్ఎన్ఎల్‌తో పాటు ప్రైవేటు సంస్థల సేవలు**




## అమల్లోకి క్యాన్సర్ మందుల తగ్గింపు ధరలు

**రోగులకు ఏడాదికి రూ.3,540 కోట్ల ఆదా**
**1,364 క్యాన్సర్ మందుల ధరలు తగ్గింపు**
**గరిష్ఠంగా 96.45 శాతం వరకు కోత..**

## పట్నం నరేందర్ రెడ్డి అరెస్ట్‌పై కేటీఆర్ ఆగ్రహం!



**కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించనీయరా?**

కోస్గిలో మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించి, అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్తున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పట్నం నరేందర్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. పరిగి బహార్‌పేట్ చౌరస్తా వద్ద నరేందర్ రెడ్డిని అదుపులోకి తీసుకోవడాన్ని ఖండించారు. కష్టాల్లో ఉన్న కార్యకర్త కుటుంబానికి అండగా నిలవడానికి వెళ్తున్న నాయకుడిని అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. (**వివరాలు 2లో..**)



## కార్యకర్తల అంత్యక్రియలకు అడ్డంకులా?

**హామీలు అమలు చేసే దమ్ముందా రేవంత్?**
**రేవంత్‌పై మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి ఫైర్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పట్నం నరేందర్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పార్టీ కార్యకర్త మృతి చెందితే వారి అంత్యక్రియల్లో పాల్గొనడానికి కూడా వెళ్లనివ్వకుండా అడ్డుకోవడం దారుణమని మండిపడ్డారు. (**వివరాలు 2లో..**)



3లో..

## 13 ఏళ్ల వైవాహిక బంధానికి పుల్‌స్టాప్

**పవన్ కళ్యాణ్, అన్నా కొణిదెల విడిపోవాలని నిర్ణయం**
**పరస్పర అంగీకారంతో విడాకుల ప్రకటన**
**పిల్లల భవిష్యత్తే తమ ప్రాధాన్యమన్న దంపతులు**



## దేశద్రోహి ఎవరో తేల్చుకుందాం

**ఎప్పుడైనా.. ఎక్కడైనా నేను రెడీ! మీరు..!?**
**'యాంటీ నేషనల్' వ్యాఖ్యలపై రణం**
**ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ సవాల్**

ప్రధాని నరేంద్ర మోదీకి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి బహిరంగ చర్చకు సవాల్ విసిరారు. దేశంలో అసలు దేశద్రోహులు ఎవరు? విదేశీ శక్తుల నియంత్రణలో పనిచేస్తున్నది ఎవరు? అనే అంశాలపై చర్చకు రావాలని డిమాండ్ చేశారు.

## లైంగిక వేధింపుల ఆరోపణలు



- వ్యవసాయ వర్సిటీ వీసీకి నోటీసులు
- నవంబర్ 12న హాజరుకావాలని ఆదేశం
- ఫిర్యాదుపై మహిళా కమిషన్ స్పందన

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యకు తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సమన్లు జారీ చేసింది. విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ నెల 12వ తేదీ గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు కమిషన్ ఎదుట వ్యక్తిగతంగా హాజరుకావాలని స్పష్టం చేసింది. ఫిర్యాదుపై స్పందన తెలుసుకునేందుకు కమిషన్ ఈ చర్య తీసుకుంది. (**వివరాలు 2లో..**)



### 34 నెలల్లో ₹ 2 లక్షల కోట్లు చెల్లించాం!

# బీఆర్ఎస్ అప్పులపై రేవంత్ నిప్పులు

- అప్పుల భారం మోస్తూనే అభివృద్ధి చేస్తున్నాం
- ఏటా రూ.80 వేల కోట్లు అప్పులకే చెల్లింపు
- కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో.. మేం ప్రజల మధ్య

**పాలమూరును విస్మరించి గజ్వేల్‌కు**

బూర్గుల రామకృష్ణారావు నుంచి ఎంతోమంది నాయకులు పాలమూరు ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించినా వలసలు ఆగలేదని, సాగునీటి ప్రాజెక్టులు పూర్తికాలేదని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సాధన కోసం ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత పాలమూరు ప్రజల ఆశలను విస్మరించారని ఆరోపించారు. పదేళ్లపాటు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసి ప్రాంత అభివృద్ధిని అడ్డుకున్నారని మండిపడ్డారు. 2023లో కొడంగల్ ప్రజల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నానని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల కష్టాలను గుర్తించి 11 లక్షల మంది ఉద్యోగులకు ప్రతి నెల మొదటి తేదీనే జీతాలు అందించాలని నిర్ణయించామని, 2024 జనవరి 1 నుంచి క్రమం తప్పకుండా మొదటి తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామని వివరించారు. గతంలో పాలమూరు ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూశారని, ఇప్పుడు అభివృద్ధి పనులు చేపట్టే సమయం వచ్చిందని పేర్కొన్నారు.

# కొడంగల్‌కు ₹ 9,053 కోట్ల అభివృద్ధి కానుక!

**ఒకేసారి 13 ప్రాజెక్టులకు సీఎం శంకుస్థాపనలు రూపురేఖలు మార్చే బృహత్తర ప్రణాళికలు**

కొడంగల్ ప్రాంతాన్ని అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పనులను చేపడుతోంది.

**విద్య, రవాణా, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం..**

విద్యారంగంలో రూ.118.80 కోట్లతో 10 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, రూ.123 కోట్లతో కొడంగల్ వ్యవసాయ కళాశాల నిర్మించనున్నారు. రవాణా రంగంలో రూ.41.83 కోట్లతో కొడంగల్, కోస్గి, మద్దూరులో ఆధునిక బస్‌స్టాండ్లు ఏర్పాటు చేస్తారు. మద్దూరులో రూ.20 కోట్లతో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ నైపుణ్యాభివృద్ధి కేంద్రం, మరో రూ.20 కోట్లతో సమీకృత డివిజనల్ కార్యాలయ సముదాయం నిర్మించనున్నారు. రూ.59.30 కోట్లతో రహదారుల అభివృద్ధి పనులు చేపడతారు. ఆధ్యాత్మిక, పర్యాటక రంగాలకు కూడా ప్రాధాన్యం ఇచ్చారు. తిమ్మారెడ్డిపల్లిలో గురులోక మసంద్ ప్రభు మందిరానికి రూ.4.45 కోట్లు, కొడంగల్ నిరంజన్ మఠానికి రూ.5.10 కోట్లు కేటాయించారు. లగచర్లలో రూ.10 కోట్లతో పర్యాటక హోటల్, రూ.81 కోట్లతో ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయనున్నారు. విద్య, వ్యవసాయం, రహదారులు, పరిశ్రమలు, ఉపాధి రంగాలను సమాంతరంగా అభివృద్ధి చేయడమే ఈ 13 ప్రాజెక్టుల ప్రధాన ఉద్దేశం.



**కేటీఆర్‌కు గడ్డం పెరిగినా రేవంత్ కాలేరు..**

కేటీఆర్‌పై కూడా ముఖ్యమంత్రి తీవ్ర విమర్శలు చేశారు. మక్తల్‌నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను ప్రభుత్వం ప్రారంభిస్తుంటే కేసీఆర్, కేటీఆర్ అడ్డుకుంటామని ప్రకటించడం ఏమిటని ప్రశ్నించారు. కేటీఆర్‌కు గడ్డం పెరగడానికి 50 ఏళ్లు పట్టిందని, బుద్ధి రావడానికి ఇంకెన్నేళ్లు పడుతుందోనని ఎద్దేవా చేశారు. గడ్డం పెంచుకున్నంత మాత్రాన రేవంత్ రెడ్డి కాలేరని, అందుకు గుండె ధైర్యం, నమ్ముకున్న ప్రజల కోసం నిలబడే తెగువ ఉండాలని వ్యాఖ్యానించారు. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నంత మాత్రాన నక్క పులి కాలేదని చురకలంటించారు. కొడంగల్‌కు డిసెంబర్ నాటికి కృష్ణా జలాలు తీసుకొచ్చి బీడు భూములను పచ్చని పంటలతో కళకళలాడిస్తానని పోలేపల్లి ఎల్లమ్మ తల్లి సాక్షిగా హామీ ఇచ్చారు. ఎవరు అడ్డొచ్చినా వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. కొడంగల్ ప్రజల అండ ఉంటే ఢిల్లీలో మోదీనైనా, కేడీనైనా ఎదుర్కొంటానని, సంక్రాంతి తర్వాత ప్రజాబలం కార్యక్రమంతో ప్రజల్లోకి వస్తామని ప్రకటించారు.

## లగచర్లలో పారిశ్రామిక విప్లవానికి శ్రీకారం

**పారిశ్రామిక కారిడార్‌తో కొడంగల్‌కు కొత్త దిశ**

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. ఈ ప్రాంతాన్ని పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లగచర్లలో నిర్వహించిన 'రైతన్నతో ఆత్మీయ సభ'లో పారిశ్రామిక అభివృద్ధిపై తన ప్రణాళికను వివరించారు. కొడంగల్ ప్రాంతానికి పెద్దఎత్తున పెట్టుబడులు తీసుకొచ్చి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రకటించారు. పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు రవాణా, వాణిజ్యం, అనుబంధ రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రాంతంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా పారిశ్రామిక సంస్థలకు అనుకూల వాతావరణం కల్పించేందుకు చర్యలు చేపడుతోంది.

**పర్యాటక హోటల్.. పామాయిల్ పరిశ్రమకు ప్రోత్సాహం..**

లగచర్ల పారిశ్రామిక కారిడార్ పరిధిలో రూ.10 కోట్లతో పర్యాటక హోటల్ నిర్మాణానికి, రూ.81 కోట్లతో ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులు స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహం అందించనున్నాయి. ముఖ్యంగా పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు వల్ల రైతులకు మార్కెట్ సదుపాయాలు మెరుగుపడే అవకాశం ఉంది. పారిశ్రామిక కారిడార్ అభివృద్ధితో కొడంగల్ ప్రాంతం కేవలం వ్యవసాయంపైనే ఆధారపడకుండా పరిశ్రమలు, సేవారంగాల్లోనూ ముందుకు వెళ్లే అవకాశం ఏర్పడుతుంది. వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చి కొడంగల్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తామని సీఎం ప్రకటించడం ఈ ప్రాంత భవిష్యత్తుపై ఆశలు పెంచుతోంది. అయితే పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడుల కార్యరూపం, స్థానికులకు ఉపాధి కల్పన కీలకంగా మారనున్నాయి.

## డిసెంబర్‌లో కొడంగల్‌కు కృష్ణా జలాలు!

- ఎత్తిపోతల పనులకు వేగం పెంచుతాం..
- ఎవరు అడ్డొచ్చినా ప్రాజెక్టులు ఆగవు..
- వలసల జిల్లాకు సాగునీటి భరోసా..
- పాలమూరు రైతులకు సీఎం హామీ..

పాలమూరు జిల్లాలో దశాబ్దాలుగా కొనసాగుతున్న వలసలకు సాగునీటి సమస్యే ప్రధాన కారణమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నో ప్రభుత్వాలు మారినా ఈ ప్రాంత ప్రాజెక్టులు పూర్తికాలేదని, రైతుల పొలాలకు ఆశించిన స్థాయిలో నీళ్లు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మక్తల్‌నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను తమ ప్రభుత్వం ప్రారంభిస్తుంటే కేసీఆర్, కేటీఆర్ అడ్డుకుంటామని మాట్లాడుతున్నారని విమర్శించారు. రైతులకు సాగునీరు అందించే పనులను అడ్డుకోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. డిసెంబర్ నాటికి కృష్ణా జలాలను కొడంగల్‌కు తీసుకొచ్చి బీడు భూములను పచ్చని పంటలతో కళకళలాడిస్తామని ప్రకటించారు. ఈ లక్ష్యాన్ని నెరవేర్చడం తన బాధ్యతగా భావిస్తున్నానని పోలేపల్లి ఎల్లమ్మ తల్లి సాక్షిగా హామీ ఇచ్చారు.

**అడ్డంకులను అధిగమించి ప్రాజెక్టుల పూర్తి..**

కొడంగల్‌కు కృష్ణా జలాలు తీసుకొచ్చే విషయంలో ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే వెనక్కి తగ్గబోమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అడ్డొచ్చే వారిని అధిగమించి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తామని ధీమా వ్యక్తం చేశారు. పాలమూరు జిల్లాను గత పాలకులు నిర్లక్ష్యం చేశారని, ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. ఎత్తిపోతల పథకం రెండో దశకు రూ.2,100 కోట్లతో శంకుస్థాపన చేయడం ఈ దిశగా కీలక అడుగుగా నిలుస్తోంది. సాగునీరు అందుబాటులోకి వస్తే రైతులు వర్షాలపై ఆధారపడాల్సిన పరిస్థితి తగ్గుతుంది. వ్యవసాయ ఉత్పత్తులు పెరగడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయి. కొడంగల్‌ను సస్యశ్యామలం చేయడమే తన లక్ష్యమని సీఎం ప్రకటించారు.

## ప్రజాబలంతో రాజకీయ సునామీ సృష్టిస్తా

**సంక్రాంతి తర్వాత ప్రజల్లోకి వస్తానన్న సీఎం**

లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో నిర్వహించిన 'రైతన్నతో ఆత్మీయ సభ' రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్న ఈ కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి రాష్ట్ర రాజకీయాలపై తన భవిష్యత్ కార్యాచరణను వెల్లడించారు. కొడంగల్ ప్రజలు తనకు అండగా నిలిస్తే ఢిల్లీలో ప్రధాని మోదీనైనా, రాజకీయ ప్రత్యర్థులనైనా ఎదుర్కొంటానని ప్రకటించారు. సంక్రాంతి తర్వాత 'ప్రజాబలం' పేరుతో ప్రజల్లోకి వస్తామని, ప్రజల మద్దతుతో రాజకీయ సునామీ సృష్టిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**ఎల్లినోను ఎదుర్కొందాం.. జర్నలిస్టులకు భరోసా..**

రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టేందుకు నిరంతరం పనిచేస్తానని ముఖ్యమంత్రి ప్రకటించారు. రాబోయే రోజుల్లో ఎదురయ్యే ఎల్లినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. వాతావరణ పరిస్థితుల కారణంగా వ్యవసాయ రంగానికి ఎదురయ్యే సవాళ్లను సమష్టిగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. ఇదే సభలో జర్నలిస్టుల సమస్యలపైనా స్పందించారు. మీడియా ప్రతినిధులు అధైర్యపడవద్దని, వారి సమస్యలను పరిష్కరించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ వారి సమస్యలను తెలుసుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజాబలం, అభివృద్ధి, రైతుల సంక్షేమం కేంద్రంగా రాబోయే రోజుల్లో రాజకీయ కార్యాచరణ కొనసాగిస్తామని రేవంత్ రెడ్డి తన ప్రసంగం ద్వారా స్పష్టం చేశారు.

## పట్నం నరేందర్ రెడ్డి అరెస్ట్‌పై కేటీఆర్ ఆగ్రహం!

బాధిత కుటుంబాన్ని పరామర్శించడం కూడా కాంగ్రెస్ పాలనలో నేరంగా మారిందా అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. మానవీయ బాధ్యతతో కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న నాయకుడిని అడ్డుకోవడం సమంజసం కాదని కేటీఆర్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

**ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారంటూ విమర్శలు..**

ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు ఉన్న హక్కులను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. అయితే అక్రమ అరెస్టులు, నిర్బంధాల ద్వారా ప్రతిపక్ష నాయకులను భయభ్రాంతులకు గురిచేయడమే పాలనగా మార్చుకున్నారని విమర్శించారు. ప్రజల సమస్యలపై స్పందించే నాయకులను అడ్డుకోవడం, కార్యకర్తలకు అండగా నిలిచే ప్రయత్నాలను నిరోధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందన్నది బీఆర్ఎస్ ప్రధాన ఆరోపణగా కేటీఆర్ స్పష్టం చేశారు.

## కార్యకర్తల అంత్యక్రియలకు అడ్డంకులా?

ఒకవైపు రైతులు సాగునీరు, విద్యుత్ లేక ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు తన పుట్టినరోజు వేడుకల కోసం మూడు రోజులపాటు సభలు నిర్వహించి రూ.150 కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేశారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రచార కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. నీకు చేతనైతే, దమ్ముంటే ఇచ్చిన హామీలను అమలు చేసి చూపించాలని రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు.

**కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా..**

తనను కలిసిన కార్యకర్తల కుటుంబాలను ఎన్నటికీ మరిచిపోనని నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. గుండుమాల్ మండలం అమ్లికుంటకు చెందిన ఉద్యమకారుడు, కోస్గి మాజీ మండల అధ్యక్షుడు ఎట్ల చెన్నప్ప, ముంగిమల్ల గ్రామ మాజీ సర్పంచ్ ఈరన్న మృతిపై ఆయన సంతాపం తెలిపారు. వారి భౌతికకాయాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. పదవులు ఉన్నా లేకపోయినా కార్యకర్తలతో తన అనుబంధం కొనసాగుతుందని, వారి కుటుంబాలకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ప్రార్థించారు. కష్టసుఖాల్లో కార్యకర్తల పక్షాన నిలబడటమే తన బాధ్యతని పేర్కొన్నారు.

## లైంగిక వేధింపుల ఆరోపణలు

ఈ నెల 12వ తేదీ గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు కమిషన్ ఎదుట వ్యక్తిగతంగా హాజరుకావాలని స్పష్టం చేసింది. ఫిర్యాదుపై స్పందన తెలుసుకునేందుకు కమిషన్ ఈ చర్య తీసుకుంది.



**వేధింపులు, బెదిరింపులకు గురయ్యానన్న మహిళ**

వ్యవసాయ సూక్ష్మజీవ శాస్త్రం, బయోఎనర్జీ విభాగంలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ ఈ ఫిర్యాదు చేశారు. గతవారం మీడియాతో మాట్లాడిన ఆమె, తనను లైంగికంగా వేధించడంతో పాటు శరీరాకృతిపై అవమానకర వ్యాఖ్యలు చేశారని, బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే ఉన్నతస్థాయి పోలీసు అధికారులను, మహిళా భద్రతా విభాగాన్ని ఆశ్రయించినట్లు వెల్లడించారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ సంబంధిత అధికారుల జోక్యం కోసం విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

**ఆరోపణలను ఖండించిన వర్సిటీ సిబ్బంది**

మరోవైపు, విశ్వవిద్యాలయానికి చెందిన పలువురు ప్రొఫెసర్లు, సిబ్బంది ఫిర్యాదుదారు చేసిన ఆరోపణలను వ్యతిరేకించారు. అవి అవాస్తవమని, వ్యక్తిగత కారణాలతో చేసినవని వారు పేర్కొన్నారు. నవంబర్ 7న మీడియా సమావేశం నిర్వహించిన వారు, ఇటీవల ఆమెను నిజామాబాద్‌కు బదిలీ చేయడంతో వీసీపై అసంతృప్తి పెరిగి ఈ ఫిర్యాదు చేసినట్లు ఆరోపించారు. ఈ నేపథ్యంలో మహిళా కమిషన్ వీసీని విచారణకు పిలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. నవంబర్ 12న ఆయన ఇచ్చే వివరణతో ఈ వ్యవహారంలో తదుపరి పరిణామాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## భాగ్యలక్ష్మి ఆలయంలో భక్తజన సందడి!

- ఖజానా వెండి నాణేల కోసం పోటెత్తిన భక్తులు
- చార్మినార్ వద్ద ఆధ్యాత్మిక కోలాహలం..
- మూడు రోజుల పాటు వెండి నాణేల పంపిణీ..

ఆదివారం రాత్రి 7 గంటలకు ప్రారంభమైన ఈ పంపిణీ కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. అమ్మవారి వెండి నాణెం ఇంటికి తీసుకెళ్తే శుభం కలుగుతుందని, కుటుంబంలో ఐశ్వర్యం, సంపద పెరుగుతాయని భక్తులు విశ్వసిస్తున్నారు. ఈ నమ్మకంతో ప్రతి ఏడాది దీపావళి సమయంలో ఆలయానికి వచ్చి ఖజానా నాణేలను స్వీకరించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

**గుల్జార్‌హౌస్ వరకు భక్తుల బారులు..**

ఖజానా వెండి నాణేల కోసం భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయం పరిసరాల్లో సందడి నెలకొంది. అమ్మవారి నాణేలు పొందేందుకు భక్తులు గంటల తరబడి వేచి ఉంటున్నారు. వారి క్యూలు ఆలయం నుంచి గుల్జార్‌హౌస్ వరకు విస్తరించాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రద్దీని నియంత్రించేందుకు నాలుగు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి, వాటి ద్వారా క్రమపద్ధతిలో నాణేల పంపిణీ చేపడుతున్నారు. భక్తుల రాక పెరుగుతున్న నేపథ్యంలో పంపిణీ ప్రక్రియను సజావుగా కొనసాగించేందుకు నిర్వాహకులు చర్యలు తీసుకుంటున్నారు.



**11వ తేదీ వరకు ఖజానా పంపిణీ..**

భాగ్యలక్ష్మి అమ్మవారి ఖజానా వెండి నాణేల పంపిణీ కార్యక్రమం ఈ నెల 11వ తేదీ వరకు మొత్తం మూడు రోజుల పాటు కొనసాగనుంది. దీపావళి వేళ అమ్మవారి ఆశీస్సులు పొందాలనే ఆకాంక్షతో భక్తులు ఆలయానికి చేరుకుంటున్నారు. వెండి నాణెం ఇంటికి తీసుకెళ్లడం శుభప్రదమని, కుటుంబానికి సంపద, సౌభాగ్యం కలుగుతాయని వారి విశ్వాసం. దీంతో పాతబస్తీలో పండుగ వాతావరణంతో పాటు ఆధ్యాత్మిక సందడి నెలకొంది. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ కార్యక్రమానికి భక్తుల తాకిడి మరింత పెరిగే అవకాశం ఉంది.

## జనగణన రెండో దశ ఖరారు

- ఇంటి వద్దకే అధికారుల రాక
- జనవరి 10 నుంచి స్వీయ గణన



కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ 30న జారీ చేసిన నోటిఫికేషన్‌ను పునఃప్రచురిస్తూ తెలంగాణ ప్రభుత్వం నవంబర్ 9న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జనగణన రెండో దశ షెడ్యూల్ ఖరారైంది.

**ఇప్పటికే పూర్తయిన తొలి దశ ప్రక్రియ**

జనగణన 2027లో భాగంగా తొలి దశను తెలంగాణలో ఈ ఏడాది నిర్వహించారు. ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు స్వీయ గణనకు అవకాశం కల్పించగా, మే 11 నుంచి జూన్ 9 వరకు అధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేశారు. ఇప్పుడు రెండో దశలో జనాభా లెక్కల సేకరణ చేపట్టనున్నారు. ప్రజలు జనవరి 10 నుంచి 24 మధ్య స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఆ తర్వాత అధికారుల ఇంటింటి సర్వే కొనసాగుతుంది. జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జరిగే ఈ ప్రక్రియలో ఎవరూ మినహాయింపు కాకుండా జనాభా వివరాల నమోదు పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. మార్చి మొదటి ఐదు రోజుల్లో తుది పరిశీలన చేపడతారు.

## బియ్యం ధరల దోపిడీకి చెక్

- దళారుల ఆటలకు కళ్లెం!
- మిల్లర్ల నుంచి నేరుగా రిటైలర్లకు సరఫరా
- బియ్యం కొరత పేరుతో కృత్రిమ దందా..
- దళారులపై నిఘా, అక్రమార్కులపై చర్యలు..
- సామాన్యుడికి ధరల ఉపశమనం ఎప్పుడో?



ఇప్పటివరకు మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు, మధ్యవర్తుల మీదుగా దుకాణాలకు చేరుతున్న బియ్యాన్ని నేరుగా రిటైలర్లకు అందించడం ద్వారా దళారుల ప్రమేయాన్ని తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్థానిక వ్యాపారులు తమ ప్రాంత జిల్లా పౌరసరఫరాల అధికారి (డీసీఎస్ఓ)ను సంప్రదించి అవసరమైన స్టాక్ కోసం ఇండెంట్ సమర్పించాలి. అనంతరం మిల్లర్ల నుంచి నేరుగా బియ్యం పొందవచ్చు. అయితే ఈ నిర్ణయం ప్రకటించినంత మాత్రాన మార్కెట్లో ధరలు తగ్గుతాయా? మధ్యవర్తుల దోపిడీ పూర్తిగా ఆగుతుందా? అన్నది సామాన్యుడి ప్రశ్న. ఎందుకంటే రోజువారీ అవసరాల్లో బియ్యం ధరల పెరుగుదల మధ్యతరగతి, పేద కుటుంబాల వంటింటి బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది.

**కొరత సృష్టించి ధరలు పెంచితే కఠిన చర్యలు..**

మార్కెట్లో బియ్యం నిల్వలు లేవంటూ కొందరు వ్యాపారులు ప్రచారం చేస్తున్న నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ అప్రమత్తమైంది. కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచేందుకు పుకార్లు వ్యాప్తి చేయవద్దని మధ్యవర్తులను హెచ్చరించింది. వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తప్పుడు ప్రచారంతో ధరలు పెంచే ప్రయత్నాలకు సహకరించవద్దని స్థానిక రిటైలర్లకు సూచించింది. పౌరసరఫరాల శాఖ డైరెక్టర్, చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. అయితే బియ్యం నిజంగా అందుబాటులో ఉన్నప్పటికీ దుకాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తే బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నకు క్షేత్రస్థాయి తనిఖీలు, నిరంతర పర్యవేక్షణ ద్వారానే సమాధానం లభించనుంది.

**ధరల పరిమితులు ఉల్లంఘిస్తే పీడీ యాక్ట్..**

ప్రభుత్వం ఇప్పటికే మూడు రకాల సన్నబియ్యానికి గరిష్ఠ చిల్లర ధరలు నిర్ణయించింది. బీపీటీ, కేఎన్ఎం రకాల ధర కిలోకు రూ.66గా, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రకాల ధర రూ.74గా, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకాల ధర రూ.79గా నిర్ణయించింది. ఈ ధరలను దుకాణాల్లో స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించింది. మరోవైపు ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ అక్రమాలను గుర్తించారు. 25 కిలోల బస్తాలో 26 కిలోలుగా లేబుల్ వేయడం, అసలు ధర కంటే ఎక్కువ ఎంఆర్‌పీ ముద్రించడం వంటి మోసాలు వెలుగులోకి వచ్చాయి. పదేపదే ఇలాంటి ఉల్లంఘనలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ ప్రయోగించేందుకు శాఖ సిద్ధమవుతోంది.

**ప్రభుత్వ చర్యలకు ఫలితం ఎప్పుడొస్తుంది?**

మిల్లర్ల నుంచి రిటైలర్లకు నేరుగా సరఫరా చేయడం, ధరల నియంత్రణ, దుకాణాల్లో తనిఖీలు స్వాగతించదగిన చర్యలే. కానీ అసలు సమస్య దళారుల దోపిడీతో పాటు మార్కెట్లో ధరల నియంత్రణ సక్రమంగా అమలవుతుందా అన్నదే. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు బియ్యం అందుబాటులో ఉండాలి. ప్రతి దుకాణంలో ధరల పట్టిక కనిపించాలి. తూకంలో మోసం చేసినా, అధిక ధర వసూలు చేసినా వెంటనే చర్యలు తీసుకోవాలి. లేకపోతే నిబంధనలు కాగితాలకే పరిమితమవుతాయి. రేషన్ దుకాణాల నుంచి బహిరంగ మార్కెట్ వరకు బియ్యం సరఫరాపై నిరంతర నిఘా అవసరం. ధరల పెరుగుదలతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న సామాన్యుడికి ప్రభుత్వ ప్రకటనలు కాదు.. తన జేబుకు ఉపశమనం కలిగించే ధరలే కావాలి. దళారుల దోపిడీ ఆగి, నాణ్యమైన బియ్యం సరసమైన ధరకు దొరికినప్పుడే ఈ ప్రభుత్వ చర్యకు నిజమైన ఫలితం లభించినట్లవుతుంది.

# జనవరిలో ఎలక్షన్ షెడ్యూల్

- ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల సందడి
- నవంబర్ చివరి నుంచి ఈసీ కసరత్తు
- సంక్రాంతికి ముందే మోగనున్న నగారా!



దేశంలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేస్తోంది. వచ్చే ఏడాది జనవరి మొదటి పక్షంలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉందని ఎన్నికల సంఘం వర్గాలు వెల్లడించాయి. ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)తో పాటు ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఈ రాష్ట్రాల్లో పర్యటించిన తర్వాతే ఎన్నికల తేదీల ప్రకటన వెలువడనుంది. ఈ ముగ్గురు సభ్యులతో కూడిన పూర్తి స్థాయి ఎన్నికల సంఘం బృందం నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్‌లో రాష్ట్రాల పర్యటన ప్రారంభించే అవకాశం ఉంది. ఇప్పటికే ఎన్నికల సన్నాహాలను పరిశీలించేందుకు డిప్యూటీ ఎన్నికల కమిషనర్ల (డీఈసీ) స్థాయి బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేపట్టాయి. ఈ పర్యటనల నివేదికల ఆధారంగానే తుది ఎన్నికల షెడ్యూల్ రూపుదిద్దుకోనుంది.

**రాష్ట్రాల్లో అధికారుల సమావేశాలు..**
**ఏర్పాట్ల పరిశీలన..**

ఐదు రాష్ట్రాల్లో డీఈసీ స్థాయి బృందాల పర్యటనలు నవంబర్ చివరి నాటికి పూర్తయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్‌లో ఈ బృందాల పర్యటనలు ఇప్పటికే ముగిశాయి. ఉత్తరప్రదేశ్‌లో ఒక పర్యటన పూర్తికాగా, మరో రెండు పర్యటనలు జరగాల్సి ఉంది. గోవాలో పర్యటన ఇంకా ప్రారంభం కాలేదు. అన్ని రాష్ట్రాల్లో పర్యటనలు పూర్తయ్యాక సంబంధిత బృందాలు తమ నివేదికలను ముగ్గురు ఎన్నికల కమిషనర్లకు అందజేస్తాయి. ఈసీ బృందాలు జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓలు), ఎస్పీలతో సమావేశమై ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు, భద్రతా పరిస్థితులను సమీక్షిస్తున్నాయి. అనంతరం పూర్తి స్థాయి కమిషన్ పర్యటనల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, డీజీపీలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతోనూ సమావేశాలు నిర్వహించనున్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన యంత్రాంగం, భద్రతా ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష చేపట్టనున్నారు.

**యూపీలో పలు దశలు..**
**మిగిలిన చోట్ల ఒకే విడత?**

ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలను ఎన్ని దశల్లో నిర్వహించాలనే అంశంపై ఎన్నికల సంఘంలో ఇప్పటివరకు ఎలాంటి తుది చర్చ జరగలేదని సమాచారం. అయితే పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్‌లో ఒకే విడతలో పోలింగ్ జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. జనాభా, నియోజకవర్గాల సంఖ్య ఎక్కువగా ఉన్న ఉత్తరప్రదేశ్‌లో మాత్రం పలు దశల్లో ఎన్నికలు నిర్వహించే అవకాశముంది. పోలింగ్ దశలు, భద్రతా ఏర్పాట్లు, తుది తేదీలపై ఎన్నికల ప్రకటనకు సమీపంలో నిర్ణయం తీసుకోనున్నారు. జనవరి తొలి పక్షంలో షెడ్యూల్ విడుదలైతే ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల రాజకీయ వేడి ఒక్కసారిగా పెరగనుంది. అధికార పార్టీలు, ప్రతిపక్షాలు ఇప్పటికే ఎన్నికల వ్యూహాలకు పదును పెడుతున్న నేపథ్యంలో ఈసీ ప్రకటనపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# పార్లమెంట్ చరిత్రలో కొత్త రికార్డు



- 88 రోజులుగా ముగియని సమావేశాలు!
- డీలిమిటేషన్ బిల్లుల కోసమేనా జాప్యం?
- ప్రత్యేక సమావేశాలపై ఉత్కంఠ

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసినా, అధికారికంగా ముగింపు పలకకపోవడం దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. లోక్‌సభ, రాజ్యసభలను ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా వేసినప్పటికీ, నవంబర్ 9 ఉదయం వరకు ప్రోరోగ్ చేయలేదు. దీంతో గతంలో 2008లో నమోదైన 87 రోజుల రికార్డును అధిగమించి 88 రోజుల సరికొత్త రికార్డు నమోదైంది. సభలను అధికారికంగా ప్రోరోగ్ చేయకపోవడంతో ప్రస్తుత సమావేశాలనే తిరిగి నిర్వహించే అవకాశం ఇంకా సజీవంగా ఉంది. మహిళా రిజర్వేషన్ చట్టం అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ ప్రతిపాదనలపై చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎప్పుడైనా పార్లమెంట్‌ను సమావేశపరిచే అవకాశం ఉందన్న ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ ప్రతిపాదనలో భాగంగా డీలిమిటేషన్ ద్వారా లోక్‌సభ స్థానాలను ప్రస్తుత 543 నుంచి గరిష్ఠంగా 850కి పెంచాలనే అంశం కూడా ఉంది.

**ప్రత్యేక సమావేశాలకు**
**రెండు రోజుల నోటీసు**


ప్రస్తుత సమావేశాలను కొనసాగిస్తూ ప్రత్యేకంగా లేదా పొడిగింపుగా పార్లమెంట్‌ను సమావేశపరిస్తే కనీసం రెండు రోజుల ముందస్తు నోటీసు సరిపోతుంది. అదే కొత్త సమావేశాలను ప్రారంభించాలంటే కనీసం 14 రోజుల నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నిబంధనల నేపథ్యంలో ప్రభుత్వం ప్రస్తుత సమావేశాలను ప్రోరోగ్ చేయకుండా కొనసాగించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా ఏప్రిల్ 17న బడ్జెట్ సమావేశాల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక భేటీలో మహిళా రిజర్వేషన్ అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో అవసరమైన మద్దతు పొందలేకపోయింది. దీంతో మరోసారి ఈ బిల్లును సభ ముందుకు తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది. అయితే సమావేశాలను ఎప్పుడైనా తిరిగి నిర్వహించేందుకు వీలుగా ఉంచడమే ప్రభుత్వ ఉద్దేశమా అన్నది ఇంకా స్పష్టత లేదు.

**రాజ్యాంగంలో గడువు లేదు..**
**గతంలోనూ ఉదాహరణలు..**

లోక్‌సభను నిరవధికంగా వాయిదా వేసిన తర్వాత ఎన్ని రోజుల్లో ప్రోరోగ్ చేయాలనే విషయంలో రాజ్యాంగం నిర్దిష్ట గడువును విధించలేదు. ఎక్కువ రోజులు ప్రోరోగ్ చేయకపోవడం మాత్రమే రాజ్యాంగ ఉల్లంఘనగా పరిగణించలేమని పార్లమెంటరీ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. గతంలో 2008లో 87 రోజులు, 1987లో 76 రోజులు, 1989లో 54 రోజులు, 2006, 2013లో 49 రోజుల పాటు సమావేశాలు ప్రోరోగ్ కాలేదు. 2008లో జూలై 21, 22 తేదీల్లో అప్పటి యూపీఏ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానంపై చర్చించేందుకు లోక్‌సభ సమావేశమైంది. అనంతరం అక్టోబర్ 17న తిరిగి సమావేశమై, అక్టోబర్ 24న వాయిదా పడింది. డిసెంబర్ 10న మళ్లీ సమావేశమయ్యేలా నిర్ణయించారు. ఇప్పుడు 88 రోజుల జాప్యంతో కొత్త రికార్డు నమోదవడం, డీలిమిటేషన్ బిల్లులపై రాజకీయ చర్చకు మరింత ఊతమిస్తోంది.

# దేశద్రోహి ఎవరో తేల్చుకుందాం

- ఎప్పుడైనా.. ఎక్కడైనా నేను రెడీ! మీరు?
- 'యాంటీ నేషనల్' వ్యాఖ్యలపై రణం
- ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ సవాల్



ప్రధాని నరేంద్ర మోదీకి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి బహిరంగ చర్చకు సవాల్ విసిరారు. దేశంలో అసలు దేశద్రోహులు ఎవరు? విదేశీ శక్తుల నియంత్రణలో పనిచేస్తున్నది ఎవరు? అనే అంశాలపై ముఖాముఖి చర్చకు రావాలని డిమాండ్ చేశారు. దీపావళి సందర్భంగా ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ సీఆర్‌పీఎఫ్ శిబిరాన్ని సందర్శించిన ప్రధాని మోదీ, భద్రతా సిబ్బందిని ఉద్దేశించి చేసిన ప్రసంగంపై రాహుల్ తీవ్రంగా స్పందించారు. సాయుధ మావోయిస్టులను అంతం చేసినప్పటికీ, దేశంలో 'దిమాగీ నక్సల్స్' (మేధో నక్సల్స్) ఉన్నారని, వారు రాజకీయ పార్టీలు, సంస్థల్లోకి చొరబడి రాజ్యాంగం, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొడుతున్నారని మోదీ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలతో రాజకీయ ప్రత్యర్థులను నక్సలైట్లుగా ముద్ర వేస్తున్నారని రాహుల్ మండిపడ్డారు.

**సైనికుల ముందే రాజకీయ విమర్శలా?**

సీఆర్‌పీఎఫ్ జవాన్లను ఉద్దేశించి ఎక్స్ వేదికగా స్పందించిన రాహుల్ గాంధీ, ప్రధాని ప్రసంగంపై వారి ముఖాల్లోనే అసంతృప్తి కనిపించిందని వ్యాఖ్యానించారు. మోదీ చెప్పిన మాటలను జవాన్లు నమ్మలేదని విమర్శించారు. రాజకీయ ప్రత్యర్థులను నక్సలైట్లుగా అభివర్ణించడం సరికాదని పేర్కొంటూ, దేశద్రోహి ఎవరు? విదేశీ శక్తుల చేతిలో కీలుబొమ్మగా ఉన్నది ఎవరు? అనే అంశాలపై ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు సిద్ధమని ప్రకటించారు. చర్చ ముగిసిన తర్వాత ఏ ఒక్క జవాను ముందుకు వెళ్లి నిలబడే ధైర్యం కూడా ప్రధానికి ఉండదని ఘాటుగా వ్యాఖ్యానించారు. గతంలో స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోనూ మోదీ 'దిమాగీ నక్సల్స్' ప్రస్తావన తీసుకొచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ నేతలు కూడా ప్రధాని వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. దీపావళి వంటి పవిత్రమైన, రాజకీయాలకు అతీతమైన సందర్భంలో భద్రతా బలగాల యూనిఫామ్ ధరించి రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు చేయడం సంప్రదాయాలకు విరుద్ధమని జైరాం రమేశ్ ఆరోపించారు.

**బహిరంగ చర్చపై బీజేపీ ఎదురుదాడి..**

మోదీని బహిరంగ చర్చకు ఆహ్వానించడం రాహుల్ గాంధీకి ఇదే తొలిసారి కాదు. గతంలోనూ ఐదు నిమిషాల చర్చలోనే ప్రధాని దేశద్రోహి అని నిరూపిస్తానంటూ సవాల్ చేసిన సందర్భాలున్నాయి. అయితే రాహుల్ పార్లమెంటులో చర్చలకు దూరంగా ఉంటున్నారని బీజేపీ నేతలు ఎదురుదాడి చేస్తున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా పార్లమెంటే చర్చలకు సరైన వేదికని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేతగా రాహుల్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మరోవైపు, ప్రధాని మోదీపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేస్తూ, ఆయన రాజకీయంగా ఆందోళనలో ఉన్నారని వ్యాఖ్యానించింది. దీంతో 'దిమాగీ నక్సల్స్' వ్యాఖ్యలు ఇప్పుడు భద్రతా వ్యవస్థ నుంచి రాజకీయ పార్టీల మధ్య ప్రత్యక్ష పోరుకు దారితీశాయి. రాహుల్ విసిరిన బహిరంగ చర్చ సవాల్‌ను ప్రధాని స్వీకరిస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

- లోక్‌సభ ప్రొరోగేషన్‌పై కాంగ్రెస్ ఆరోపణలు
- మూడింట రెండొంతుల మెజారిటీ కోసమేనా?
- అమిత్ షాపై జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు



# డీలిమిటేషన్ బిల్లుల కోసం కొత్త ఎత్తుగడ

లోక్‌సభ నిరవధిక వాయిదా (సైన్ డై) పడినప్పటికీ, ఇప్పటివరకు సభను అధికారికంగా ప్రొరోగ్ చేయకపోవడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. డీలిమిటేషన్ బిల్లులను ఆమోదించేందుకు అవసరమైన లోక్‌సభలోని రెండు మూడొంతుల మెజారిటీని కూడగట్టుకునేందుకే కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఈ జాప్యం చేస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు. నవంబర్ 9న సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో స్పందించిన ఆయన, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు రాజకీయంగా అవసరమైన సంఖ్యాబలాన్ని సమకూర్చుకునేందుకు ఈ వ్యవధిని ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. డీలిమిటేషన్ బిల్లులు దేశ రాజకీయ వ్యవస్థపై ప్రభావం చూపే ప్రమాదకరమైన ప్రతిపాదనలని ఆయన పేర్కొన్నారు.

**పార్లమెంటరీ నిబంధనలే ఆధారం**


పార్లమెంటరీ వ్యవహారాలపై అధికారిక మార్గదర్శకంగా భావించే 2024లో ప్రచురితమైన ప్రాక్టీస్ అండ్ ప్రొసీజర్ ఆఫ్ పార్లమెంట్ ఎనిమిదో ఎడిషన్‌ను జైరాం రమేశ్ ప్రస్తావించారు. కౌల్ అండ్ షక్ధర్‌గా ప్రసిద్ధి చెందిన ఈ పుస్తకంలోని 192వ పేజీ ప్రకారం, లోక్‌సభ నిరవధిక వాయిదా పడిన తర్వాత ప్రొరోగేషన్‌కు సాధారణంగా రెండు నుంచి నాలుగు రోజుల వ్యవధి మాత్రమే ఉంటుందని తెలిపారు. 2015 వర్షాకాల సమావేశాల్లో అత్యధికంగా 28 రోజుల జాప్యం నమోదైనట్లు ఫుట్‌నోట్‌లో ఉందన్నారు. అయితే 2008లో 87 రోజుల పాటు సభను ప్రొరోగ్ చేయని విషయాన్ని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అక్టోబర్ 19న మల్లికార్జున ఖర్గేకు రాసిన లేఖలో ప్రస్తావించారని గుర్తుచేశారు. ఆ సమయంలో అన్ని పార్టీల అంగీకారంతోనే ఆ నిర్ణయం తీసుకున్నారని, ఇప్పుడు 88 రోజుల జాప్యంతో కొత్త రికార్డు నమోదైందని విమర్శించారు.

**ప్రతిపక్ష ఐక్యతతో అడ్డుకుంటాం**

గతంలో 2026 ఏప్రిల్ 17న మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును ప్రతిపక్షాల ఐక్యతతో అడ్డుకున్నామని జైరాం రమేశ్ గుర్తుచేశారు. అమిత్ షా తనదైన దూకుడు రాజకీయ వ్యూహాలతో ముందుకొచ్చినా, ప్రతిపక్షాల ఐక్యత మరోసారి ప్రభుత్వ ప్రయత్నాలను నిలువరిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చట్టం తీసుకురాకముందే అన్ని పార్టీలతో పారదర్శకంగా చర్చించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గత ఆరు నెలల్లో నాలుగుసార్లు ప్రధాని నరేంద్ర మోదీకి లేఖలు రాశారని తెలిపారు. అఖిలపక్ష సమావేశం నిర్వహించి సమగ్రంగా చర్చించాలన్న విజ్ఞప్తిని ప్రధాని పట్టించుకోలేదని ఆరోపించారు. డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా, దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అన్ని పార్టీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది.

# అమల్లోకి క్యాన్సర్ మందుల తగ్గింపు ధరలు

- రోగులకు ఏడాదికి రూ.3,540 కోట్ల ఆదా
- 1,364 క్యాన్సర్ మందుల ధరలు తగ్గింపు
- గరిష్ఠంగా 96.45 శాతం వరకు కోత..



క్యాన్సర్ చికిత్స పొందుతున్న రోగులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. 1,364 రకాల క్యాన్సర్ మందుల గరిష్ఠ చిల్లర ధరలను (ఎంఆర్‌పీ) సవరించింది. ఈ కొత్త ధరలు నవంబర్ 9, 2026 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ఈ నిర్ణయంతో వినియోగదారులకు ఏటా సుమారు రూ.3,540.38 కోట్ల మేర ఆర్థిక భారం తగ్గనుంది. కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వశాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం, నవంబర్ 8 నాటికి 85 ఔషధ కంపెనీలు 121 రకాల మందులకు సంబంధించిన 1,364 ఫార్ములేషన్ల కొత్త ధరలను ప్రకటించాయి. ఖరీదైన క్యాన్సర్ చికిత్సతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ నిర్ణయం గణనీయమైన ఉపశమనం కలిగించనుంది.

**679 బ్రాండ్లపై 50 శాతానికి పైగా తగ్గింపు..**

క్యాన్సర్ మందుల ధరల నియంత్రణలో భాగంగా నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ అక్టోబర్ 17న సమర్పించిన సిఫారసుల ఆధారంగా 137 రకాల క్యాన్సర్ మందులపై వాణిజ్య మార్జిన్లకు పరిమితులు విధించింది. దీని ఫలితంగా 679 బ్రాండ్ల మందుల ధరలు 50 శాతానికి పైగా తగ్గాయి. అత్యధికంగా ఒక బ్రాండ్ ధరపై 96.45 శాతం కోత నమోదైంది. కొత్తగా నిర్ణయించిన ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు మందులు విక్రయించడానికి మెడికల్ షాపులు, ఆసుపత్రుల ఫార్మసీలకు అనుమతి లేదని కేంద్రం స్పష్టం చేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

**ధరలు తెలుసుకునేందుకు ప్రత్యేక సదుపాయాలు..**

మందుల కొనుగోలుదారులు కొత్త ధరలను తెలుసుకునేందుకు కేంద్రం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఔషధ ప్యాకెట్లపై ముద్రించిన సవరించిన ఎంఆర్‌పీని పరిశీలించడంతో పాటు 'ఫార్మా సహీ దామ్' మొబైల్ యాప్, ఎన్‌పీపీఏ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ధరలను ధ్రువీకరించుకోవచ్చు. ఎవరైనా కొత్త ధర కంటే ఎక్కువ వసూలు చేస్తే 'ఫార్మా జన్ సమాధాన్' పోర్టల్‌లో ఫిర్యాదు చేయవచ్చు. అలాగే 1800111255 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేయవచ్చు. క్యాన్సర్ చికిత్సలో మందుల ఖర్చు ప్రధాన భారంగా మారుతున్న నేపథ్యంలో ఈ ధరల తగ్గింపు లక్షలాది రోగులకు ఊరటనిచ్చే నిర్ణయంగా భావిస్తున్నారు. అయితే కొత్త ధరలు వాస్తవంగా రోగులకు ఎంత మేరకు అందుబాటులోకి వస్తాయన్నది అమలు తీరుపై ఆధారపడి ఉంటుంది.

# గ్రామాలకు చేరువైన 4జీ ఇంటర్నెట్

- నాలుగేళ్లలో 4జీ లేనివి 75 % తగ్గుదల
- 45,180 నుంచి 11,372కు పడిపోయిన సంఖ్య
- బీఎస్ఎన్ఎల్‌తో పాటు ప్రైవేటు సంస్థల సేవలు



దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్ కనెక్టివిటీ గణనీయంగా మెరుగుపడుతోంది. నాలుగేళ్లలో 4జీ సేవలు అందుబాటులో లేని గ్రామాల సంఖ్య దాదాపు 75 శాతం తగ్గింది. 2022లో దేశవ్యాప్తంగా 45,180 గ్రామాలకు 4జీ కనెక్టివిటీ లేకపోగా, ప్రస్తుతం ఆ సంఖ్య 11,372కు పడిపోయింది. సమాచార హక్కు చట్టం కింద ది హిందూ సేకరించిన కేంద్ర టెలికమ్యూనికేషన్స్ శాఖ గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. గతంతో పోలిస్తే ఇంటర్నెట్ సేవలు గ్రామీణ ప్రాంతాలకు వేగంగా విస్తరిస్తున్నాయని ఈ వివరాలు స్పష్టం చేస్తున్నాయి. పట్టణాలు, నగరాల్లో ఇప్పటికే 5జీ సేవలు విస్తృతంగా అందుబాటులో ఉండగా, గ్రామాల్లోనూ మొబైల్ ఇంటర్నెట్ సదుపాయాలు మెరుగుపడటం డిజిటల్ రంగంలో కీలక పరిణామంగా మారింది.

**బీఎస్ఎన్ఎల్ ప్రాజెక్టుతో వేగం**


గ్రామాల్లో 4జీ సేవల విస్తరణకు బీఎస్ఎన్ఎల్ చేపట్టిన 4జీ శాచురేషన్ ప్రాజెక్టు ప్రధాన కారణాల్లో ఒకటిగా నిలిచింది. ఈ పథకం ద్వారా తొలుత 24,680 గ్రామాలకు కనెక్టివిటీ అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే 4జీ సేవలు లేని గ్రామాల సంఖ్య 11,372కు తగ్గడం చూస్తే, బీఎస్ఎన్ఎల్ ప్రాజెక్టుతో పాటు ప్రైవేటు టెలికాం సంస్థలు కూడా విస్తరణలో కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ప్రయత్నాలతో గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సేవల పరిధి పెరుగుతోంది. గతంలో పట్టణాలకు, గ్రామాలకు మధ్య ఇంటర్నెట్ సదుపాయాల్లో భారీ వ్యత్యాసం ఉండేది. తాజా గణాంకాలు ఆ అంతరాన్ని తగ్గించే దిశగా పురోగతి కనిపిస్తోందని సూచిస్తున్నాయి.

**మొబైల్ ఇంటర్నెట్‌పైనే గ్రామీణుల ఆధారం..**

దేశంలో ఇప్పటికీ ప్రతి ఒక్కరికీ స్మార్ట్‌ఫోన్ అందుబాటులోకి రాలేదు. మరోవైపు నగరాల్లో హైస్పీడ్ 5జీ సేవలు, తక్కువ ధరలో వైర్డ్ బ్రాడ్‌బ్యాండ్ సదుపాయాలు విస్తరిస్తున్నాయి. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ వినియోగానికి మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ ప్రధాన ఆధారంగా కొనసాగుతోంది. వైర్డ్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ల పెరుగుదల కొన్ని నెలలుగా మందగించడంతో మొబైల్ ఇంటర్నెట్ ప్రాధాన్యం మరింత పెరిగింది. విద్య, వైద్యం, ప్రభుత్వ సేవలు, ఆన్‌లైన్ లావాదేవీలు, సమాచార వినియోగానికి మొబైల్ కనెక్టివిటీ కీలకంగా మారింది. 4జీ లేని గ్రామాల సంఖ్య తగ్గడం శుభపరిణామమే అయినప్పటికీ, మిగిలిన 11,372 గ్రామాలకు నాణ్యమైన ఇంటర్నెట్ సేవలు అందించడం ఇంకా పెద్ద సవాలుగా మిగిలింది.

# 13 ఏళ్ల వైవాహిక బంధానికి ఫుల్‌స్టాప్

- పవన్ కళ్యాణ్, అన్నా కొణిదెల విడిపోవాలని నిర్ణయం
- పరస్పర అంగీకారంతో విడాకుల ప్రకటన
- పిల్లల భవిష్యత్తే తమ ప్రాధాన్యమన్న దంపతులు



జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఆయన భార్య అన్నా కొణిదెల తమ వైవాహిక బంధానికి ముగింపు పలుకుతున్నట్లు ప్రకటించారు. 13 ఏళ్లకు పైగా కొనసాగిన తమ వివాహ జీవితానికి స్వస్తి చెబుతూ పరస్పర అంగీకారం, అవగాహన, గౌరవంతో విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు నవంబర్ 9, సోమవారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. తమ జీవితాల్లో ఒక ముఖ్యమైన కాలాన్ని కలిసి గడిపామని, ఇప్పుడు వేర్వేరు మార్గాల్లో ప్రయాణించాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. వివాహ బంధం ముగిసినా, తాము మంచి స్నేహితులుగా కొనసాగుతామని స్పష్టం చేశారు. తమ ఇద్దరు పిల్లల పెంపకం విషయంలో మాత్రం కలిసే బాధ్యతలు నిర్వర్తిస్తామని వెల్లడించారు.

**పిల్లల సంతోషమే ఉమ్మడి బాధ్యత**

పిల్లల ఆనందం, సంక్షేమమే తమ ఉమ్మడి ప్రాధాన్యమని పవన్ కళ్యాణ్, అన్నా పేర్కొన్నారు. ఈ వ్యక్తిగత మార్పు సమయంలో తమ కుటుంబ గోప్యతను గౌరవించాలని అభిమానులు, శ్రేయోభిలాషులకు విజ్ఞప్తి చేశారు. ఇన్నాళ్లూ తమకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అయితే విడిపోవడానికి గల కారణాలను ప్రకటనలో వెల్లడించలేదు. విడాకుల ప్రక్రియ ప్రారంభమైందా? పిల్లల సంరక్షణపై ఎలాంటి నిర్ణయం తీసుకున్నారు? అనే అంశాలపై కూడా స్పష్టత ఇవ్వలేదు. 2011లో 'తీన్‌మార్' సినిమా చిత్రీకరణ సమయంలో పవన్, అన్నా తొలిసారి పరిచయమయ్యారు. రష్యాకు చెందిన అన్నా మోడల్‌గా, నటిగా పనిచేశారు. 2013 సెప్టెంబర్ 30న వీరి వివాహం జరిగింది. వీరికి కుమార్తె పోలెనా అంజనా పవనోవా, కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్ ఉన్నారు.

**పవన్‌కు ముగియనున్న మూడో వివాహ బంధం**

పవన్ కళ్యాణ్‌కి ఇది మూడో వివాహం. 1997 మేలో నందినితో మొదటి వివాహం జరగగా, 2008లో విడాకులు మంజూరయ్యాయి. అనంతరం నటి రేణు దేశాయ్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. ఆ బంధం కూడా విడాకులతో ముగిసింది. 2014లో జనసేన పార్టీని స్థాపించిన పవన్ కళ్యాణ్, 2024 జూన్‌లో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. రాజకీయ జీవితంలో కీలక స్థానానికి ఎదిగిన సమయంలో అన్నాతో విడిపోతున్నట్లు ప్రకటించడం చర్చనీయాంశమైంది. గతంలో కూడా వీరి మధ్య విభేదాలున్నాయంటూ ప్రచారం జరిగినా జనసేన స్పందిస్తూ అప్పట్లో ఆ వార్తలను ఖండించింది. తాజా సంయుక్త ప్రకటనతో 13 ఏళ్ల వైవాహిక ప్రయాణానికి ముగింపు పలికిన విషయం అధికారికంగా వెల్లడైంది.

# ఇంధనంలో కల్తీ కలకలం

- 67 చోట్ల పెట్రోల్ పరీక్షలు!
- ఇథనాల్ మోతాదుపై కర్ణాటక సీరియస్
- పెట్రోల్‌లో ఇథనాల్ శాతంపై ఫిర్యాదులు
- వాహనాల పనితీరుపై ప్రభుత్వం విచారణ



పెట్రోల్‌లో ఇథనాల్ మోతాదు పెరగడం వల్ల వాహనాల పనితీరు దెబ్బతింటోందన్న ఫిర్యాదులపై కర్ణాటక ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. రాష్ట్ర వ్యాప్తంగా 67 ప్రాంతాల్లో పెట్రోల్ నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించినట్లు ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. పెట్రోల్‌లో 31.5 శాతం వరకు ఇథనాల్ కలుపుతున్నారన్న ఆరోపణలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని చెప్పారు. ఈ వ్యవహారంపై సంబంధిత మంత్రికి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని, కేంద్ర ప్రభుత్వానికి కూడా సమాచారం పంపించామని తెలిపారు. వేలాది మంది వాహనదారులు పెట్రోల్ వినియోగం తర్వాత మైలేజీ తగ్గడం, ఆశించిన దూరం ప్రయాణించలేకపోవడం, నడుస్తున్న సమయంలోనే ఇంజిన్లు ఆగిపోవడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని ముఖ్యమంత్రి వివరించారు.

**బ్లెండింగ్ నుంచి పంపిణీ వరకు తనిఖీలు..**

కేవలం పెట్రోల్ బంకుల్లోనే కాకుండా, ఇథనాల్‌ను పెట్రోల్‌లో కలిపే ప్రక్రియ నుంచి పంపిణీ వరకు అన్ని దశల్లో తనిఖీలు నిర్వహించినట్లు శివకుమార్ వెల్లడించారు. ఎక్కడ, ఏ విధంగా ఇథనాల్ కలుపుతున్నారనే వివరాలతో పాటు సంబంధిత పత్రాలను కూడా సేకరించినట్లు తెలిపారు. తనిఖీల నివేదిక, తదుపరి చర్యలపై సంబంధిత మంత్రి సోమవారం అధికారికంగా మీడియా సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడిస్తారని చెప్పారు. పెట్రోల్ నాణ్యత, వాహనాల పనితీరు, ప్రజల భద్రత అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. తక్కువ ధరకు ఇథనాల్ అందుబాటులో ఉందని చెప్పి దాని వినియోగాన్ని పెంచడం ద్వారా లాభాలు పొందాలనే ఉద్దేశంతో బ్లెండింగ్ శాతాన్ని ఇష్టానుసారంగా పెంచడం సరికాదని వ్యాఖ్యానించారు. దీనివల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడటం ఆమోదయోగ్యం కాదన్నారు.

**కేంద్రంపై బాధ్యత.. బీజేపీ, జేడీఎస్‌పై ప్రశ్నలు..**

ఈ సమస్యపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకోలేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇంధన నాణ్యత విషయంలో కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యపై బీజేపీ, జేడీఎస్ నేతలు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ప్రతిపక్ష నేత ఆర్. అశోక్ కూడా ఈ అంశంపై స్పందించడం లేదని విమర్శించారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన సమస్యలపై ప్రతి ఒక్కరూ గళం విప్పాలి అని శివకుమార్ పిలుపునిచ్చారు. పెట్రోల్‌లో ఇథనాల్ మోతాదు పెంపుపై వస్తున్న ఫిర్యాదులు కేవలం వాహనదారుల సమస్యగా కాకుండా, ఇంధన నాణ్యత, ప్రజా భద్రతకు సంబంధించిన కీలక అంశంగా మారాయని ఆయన వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.



## మరుగుదొడ్లున్నా.. నీళ్లు లేక బాలికల అవస్థలు



మహబూబ్‌నగర్ బ్యూరో: రేవల్లి మండలం తల్పనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ నీటి సరఫరా లేక పోవడంతో వాటిని వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది. ఫ్లష్ చేయడానికి, చేతులు శుభ్రం చేసుకోవ డానికి కూడా నీళ్లు అందుబాటులో లేవు. దీంతో బాలికలు తమ ప్రాథమిక అవసరాలు తీర్చుకోవడంలో నరకయాతన అనుభవిస్తున్నారు. 'బేటీ బచావో.. బేటీ పఢావో' అంటూ బాలికల విద్య, భద్రతకు ప్రాధాన్యమిస్తు న్నామని చెబుతున్న పాలకుల హయాంలో పాఠశాలలో కనీస వసతులు లేకపోవడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణమని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాలలో తక్షణమే నీటి సరఫరా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



## టీటీడీ 2027 క్యాలెండర్లు.. ఆన్‌లైన్‌లో బుకింగ్ సౌకర్యం

నూతన సంవత్సరం 2027ను పురస్కరించుకుని టీటీడీ రూపొందించిన క్యాలెండర్లు, డైరీలను భక్తులు ఇక ఇంటి నుంచే ఆన్ లైన్ లో బుక్ చేసుకోవచ్చు. ఇందుకోసం టీటీడీ అధికారిక వెబ్ సైట్ https://ttdevasthanams.ap.gov.inలో ప్రత్యేక సదుపాయం అందుబాటు లోకి తెచ్చింది. ఆన్ లైన్ తో పాటు తిరుపతి, తిరుమల, తిరుచానూరులోని 12 విక్రయ కేంద్రాల్లోనూ వీటిని కొనుగోలు చేయవచ్చు. హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్, హిమాయత్ నగర్ తో పాటు విజయ వాడ, చెన్నై, వెల్లూరు, బెంగళూరు, న్యూఢిల్లీ, ముంబైలోని టీటీడీ సమాచార కేంద్రాల్లో కూడా విక్రయాలు కొనసా గుతున్నాయి. 2027 క్యాలెండర్లు, డైరీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సెప్టెంబర్ 7న ఆవిష్కరించారు. అదే రోజు నుంచి విక్రయాలు ప్రారంభమయ్యాయి. భక్తులు ఆన్ లైన్ బుకింగ్ సదుపాయాన్ని వినియోగిం చుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

## తిరుపతి జిల్లాలో పంచాయతీ ఎన్నికల సందడి

**నవంబర్ 26, 29న రెండు విడతల్లో పోలింగ్**



తిరుపతి జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. నవంబర్ 26, 29 తేదీల్లో రెండు విడతలుగా పోలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ప్రకటించారు. జిల్లాలోని 35 మండలాల పరిధిలో మొత్తం 807 పంచాయతీలు ఉండగా, కోర్టు కేసుల కారణంగా 30 పంచాయతీలను మినహాయించి 777 పంచాయతీల్లోని 7,210 వార్డులకు ఎన్నికలు జర గనున్నాయి. నామినేషన్ల స్వీకరణకు 195 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి విడతలో 18 మండలాల పరిధిలో 415 సర్పంచ్ స్థానాలు, 3,776 వార్డు సభ్యుల స్థానాలకు నవంబర్ 26న పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన జరుగుతాయి. రెండో విడతలో 17 మండలాల్లో 362 సర్పంచ్ స్థానాలు, 3,434 వార్డు స్థానాలకు నవంబర్ 29న ఎన్నికలు నిర్వహిస్తారు. తొలి విడత నామినేషన్లకు నవంబర్ 17, రెండో విడతకు నవంబర్ 20 చివరి తేదీలు. అవసరమైతే రీపోలింగ్ వరుసగా 27, 30 తేదీల్లో నిర్వహిస్తారు. దీంతో జిల్లాలో గ్రామస్థాయి రాజకీయ సందడి మొదలుకానుంది.

## 'ఖుషియోంకీ ఈద్' వ్యాఖ్యతో వివాదం

**ఖర్గే దీపావళి వ్యాఖ్యలపై రాజకీయ దుమారం!**

**ఈద్ ప్రస్తావనతో బీజేపీ, కాంగ్రెస్ మాటల యుద్ధం**



కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దీపావళి శుభాకాం క్షలు చెబుతూ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వివాదానికి దారితీశాయి. దీపావళి దేశమంతా జరుపుకునే గొప్ప పండుగని, ఇది సంతోషాల పండుగగా, సుదీర్ఘంగా సాగే 'ఖుషియోంకీ ఈద్' అని ఆయన అభివర్ణించారు. పండు గలు ప్రజల మధ్య ఐక్యతను పెంచాలని, సామాజిక విభే దాలను తొలగించాలని పిలుపునిచ్చారు. ఖర్గే వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు సమర్థించారు. ఈద్ అనే పదాన్ని మతప రమైన పోలికగా కాకుండా ఆనందానికి ప్రతీకగా ఉప యోగించారని, అన్ని మతాల మధ్య సోదరభావం పెంపొందించడమే ఆయన ఉద్దేశమని స్పష్టం చేశారు.

**బీజేపీ విమర్శలు.. కాంగ్రెస్ ఎదురుదాడి**

ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ, మతపరమైన బుజ్జగింపు రాజకీయాలకు కాంగ్రెస్ పాల్పడుతోందని బీజేపీ నేతలు ఆరో పించారు. మహాకుంభమేళాపై గతంలో ఖర్గే చేసిన వ్యాఖ్యలు, యమునా నదిలో ప్రధాని మోదీ స్నానంపై రాహుల్ గాంధీ చేసిన విమర్శలను ప్రస్తావించారు. మరోవైపు, కాంగ్రెస్ మాత్రం ఖర్గే వ్యాఖ్యల్లో తప్పేమీ లేదని సమర్థించింది. ఏఐఎంఐఎం నేత వారిస్ పఠాన్ సైతం ఈ వ్యాఖ్యలను రాజకీయ ప్రయోజనాల కోసం చేసిన ప్రయత్నంగా అభివర్ణించారు. దీంతో దీపావళి శుభాకాంక్షలతో మొదలైన వివాదం మతపరమైన భావాలు, రాజకీయ బుజ్జగింపు ఆరోపణల చుట్టూ దేశ రాజకీయాల్లో చర్చకు దారితీసింది.

## ఐపీఓకు ముందు ఆంత్రోపిక్ కొత్త ఏఐ మోడళ్లు!

**ఫేబుల్ 5.2, మైథోస్ 5.2తో 30 శాతం వేగం పెంపు**

అమెరికాకు చెందిన ఏఐ సంస్థ ఆంత్రోపిక్ ఫేబుల్ 5.2, మైథోస్ 5.2 పేర్లతో కొత్త ఏఐ మోడళ్లను ప్రకటించింది. ఇవి గత వెర్షన్లతో పోలిస్తే కోడింగ్ వంటి క్లిష్టమైన పనులను 30 శాతం వేగంగా పూర్తి చేయగలవని సంస్థ తెలిపింది. అదే సమయంలో వినియోగ ఖర్చు 20 శాతం తగ్గుతుందని వెల్లడించింది. ఈ నెలలో ఐపీఓకు సిద్ధమ వుతున్న ఆంత్రోపిక్ మార్కెట్ విలువ ఒక ట్రిలియన్ డాలర్లకు మించవచ్చని అంచనా. ఇది భారత కరెన్సీలో సుమారు రూ.93.94 లక్షల కోట్లు. గతంలో రెండు ట్రిలియన్ డాలర్లు (సుమారు రూ.187.88 లక్షల కోట్లు) చేరవచ్చన్న అంచనాలు ఉన్నప్పటికీ, ఇటీవల తగ్గాయి. ఐపీఓకు ముందు కొత్త మోడళ్ల ప్రకటన సంస్థకు ప్రాధాన్యం తీసుకొచ్చింది.

**పేర్లు వేరైనా..**

# పుట్టుక .. పోరాటం ఒక్కటే!

**నేతన్నల సామాజిక ప్రయోజనం ఒక్కటేనన్న భావన**
**చీరాల, వేటపాలెం జడ్పీటీసీ ఎన్నికల్లో ఐక్యతా సందేశం**
**పద్మశాలి, దేవాంగుల మధ్య ఐక్యతే లక్ష్యంగా ఆలోచనలు**
**రాజకీయ అధికారం సాధించాలన్న ఆకాంక్షకు కొత్త ఊపిరి**



చేనేత సమాజానికి ఇప్పుడు ఒక కొత్త ఆలోచన అవసరం. రాజకీయ పార్టీల పేరుతో విడిపో వడం కాదు.. సామాజిక ఆత్మగౌరవం కోసం ఒక్కటిగా నిలబడటం ముఖ్యం. పద్మశాలీలైనా, దేవాంగులైనా, ఇతర చేనేత ఉపకులాలైనా వారి వృత్తి వేరు కాదు.. వారి కష్టం వేరు కాదు.. వారి జీవన పోరాటం వేరు కాదు. తరతరాలుగా మగ్గాన్ని నమ్ముకుని బతుకుతున్న నేతన్నలంద రికీ ఎదురవుతున్న సమస్యలు దాదాపు ఒక్కటే. అలాంటప్పుడు రాజకీయాల దగ్గరకు వచ్చేస రికి మాత్రమే ఎందుకు విడిపోవాలి? మన మధ్య ఉన్న పేర్లను పక్కనపెట్టి, మనందరినీ కలిపే చేనేత గుర్తింపుకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయం వచ్చింది. పద్మశాలి, దేవాంగ అనే సామాజిక గుర్తింపుల కంటే చేనేతల ఐక్యతే ప్రధానమనే ఆలోచన బలపడాలి. ఈ దిశగా చాట్రాసి రాజేష్ ముందుకు తీసుకొస్తున్న ఆలోచన చీరాల రాజకీయాల్లో ఒక కొత్త చర్చకు తెరలేపుతోంది. ఏ పార్టీకి చెందిన వారైనా సరే, చేనేత సమాజం నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థికి మద్దతుగా నిలవాలన్నది చేనేత వర్గాల ప్రతిపాద నలోని ప్రధాన ఉద్దేశం. పార్టీలు ఎన్నికల వరకు ఉండవచ్చు.. రాజకీయ సమీకరణాలు మారవచ్చు.. కానీ సామాజిక ప్రయోజనాలు మాత్రం దీర్ఘకాలం ఉంటాయి. అందుకే చేనేతల సమస్యల పరిష్కారం, రాజకీయ ప్రాతినిధ్యం, భవిష్యత్తు తరాల ప్రయోజనాల కోసం ఒక ఉమ్మడి వేదిక అవసరం. మన సమస్యలపై మాట్లాడే గొంతు మన సమాజం నుంచే బలంగా వినిపించాలంటే ఐక్యత తప్పనిసరి. ఇది కేవలం ఎన్నికల నినాదం కాదు.. చేనేతల భవిష్యత్తుకు సంబంధించిన రాజకీయ ఆలోచన. మన కష్టాన్ని అర్థం చేసుకునే నాయకత్వం ఎదగాలంటే ముందుగా మన ఓటు విలువను మనమే గుర్తించాలి. ఇతర సామాజిక వర్గాలు రాజకీయంగా ఎదిగినట్టే చేనేత సమాజం కూడా తనకంటూ ఒక బలమైన రాజకీయ ఉనికిని నిర్మించుకోవాల న్నదే ఈ పిలుపు వెనుక ఉన్న అసలు ఆకాంక్ష.

**రాజకీయ ప్రాతినిధ్యమే..**
**సమస్యలకు శాశ్వత పరిష్కారం!**

ఒక సామాజిక వర్గం ఎంత పెద్దదైనా రాజకీ యంగా సంఘటితం కాకపోతే దాని బలం పూర్తి స్థాయిలో బయటపడదు. జనాభా ఉన్నా, ఓటు హక్కు ఉన్నా, ఎన్నికల సమయంలో విడివిడిగా వ్యవహరిస్తే రాజకీయ పార్టీలు ఆ వర్గం ఆకాంక్ష లను అంతగా పట్టించుకోవు. అందుకే చేనేత జాతికి రాజకీయ అధికారం రావాలన్న డిమాండ్ ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుం టోంది. చేనేత కార్మికుల ఉపాధి, ముడిసరుకుల ధరలు, మార్కెట్ సమస్యలు, రుణభారం, సంక్షేమ పథకాలు, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా వృత్తి అభివృద్ధి వంటి ఎన్నో అంశాలపై నిరంతరం మాట్లాడే నాయకత్వం అవసరం.

**చీరాల, వేటపాలెం తీర్పు..**
**ఐక్యతకు నిదర్శనం!**

చేనేత వర్గాలు ముందుకు తీసుకొస్తున్న ఆలోచ నకు చీరాల, వేటపాలెం జడ్పీటీసీ ఎన్నికలు ఒక ముఖ్యమైన ఉదాహరణగా నిలుస్తున్నాయి. చేనేత జాతి బలమైన ఐక్యత ప్రకటిస్తూ, పార్టీలతో సంబంధం లేకుండా బాపట్ల జిల్లా చీరాల జడ్పీటీసీ ఎన్నికల్లో చేనేతలైన పద్మశాలి, దేవాంగ సామాజిక వర్గాలకు చెందిన వారిని గెలిపించారు. చీరాలలో వైసీపీకి చెంది బిట్రా శ్రీనివాస రావు(పద్మశాలి), వేటపాలెంలో టీడీపీకి చెందిన కూటమి అభ్యర్థి నాసిక వీరభ ద్రయ్య (దేవాంగ)లు జడ్పీటీసీ సభ్యులుగా ఘన విజయం సాధించారు. రాజకీయ పార్టీలు వేరైనా చేనేత సామాజిక ప్రయోజనం కోసం ఒక్కటిగా నిలబడగలమనే సందేశాన్ని ఈ ఎన్నికల ద్వారా నేతన్నలు చాటిచెప్పారు. చీరాల మండలం, వేటపాలెం మండలాల్లో జరిగిన ఎన్నికల రాజకీయ పరిణామాలు చేనేతల ఐక్యతపై కొత్త చర్చకు దారితీశాయి. ఏ పార్టీ అభ్యర్థి అనే అంశంతో పాటు, చేనేత సమా జానికి చెందిన అభ్యర్థికి మద్దతుగా నిలవాలనే ఆలోచనకు ప్రాధాన్యం లభించింది. పార్టీ జెండాలు వేరైనా.. చేనేతల ఆత్మగౌరవం ఒక్కటే ననే సందేశం ఈ ఎన్నికల్లో స్పష్టంగా వినిపిం చింది. ఇది కేవలం రెండు మండలాలకు సంబం ధించిన రాజకీయ పరిణామం మాత్రమే కాదు. రాబోయే ఎన్నికల్లో చేనేత సమాజం అనుసరిం చాల్సిన రాజకీయ వ్యూహంపై ఒక ఆలోచనకు నాంది. ఒక సామాజిక వర్గం తన ఓటు శక్తిని గుర్తిస్తే రాజకీయ పార్టీలు కూడా ఆ వర్గం ఆకాం క్షలను తప్పనిసరిగా గుర్తించాల్సి వస్తుంది. చేనేతల ఐక్యతకు ఇదే అసలైన అర్థం. అయితే, ఈ ఐక్యత ఎన్నికల వరకే పరిమితం కాకూడదు. ఎన్నికల తర్వాత కూడా నేతన్నల సమస్యలపై ఒకే వేదికగా పోరాడాలి. యువతకు రాజకీయ అవకా శాలు కల్పించాలి. నలభై ఏళ్లుగా ఇతర సామాజిక వర్గాలు సాధించిన రాజకీయ ప్రాతినిధ్యాన్ని చేనేతలు కూడా సాధించా లన్న ఆకాంక్షకు ఇప్పుడు బలం చేకూరుతోంది. చీరాల, వేటపాలెం ఎన్నికలు చూపించిన దారిని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి నేతన్నపై ఉంది. చేనేత వర్గాల ఆలో చనలోని ప్రధాన సారాంశం కూడా ఇదే. మన ఊరు.. మన సమాజం.. మన నాయకత్వం.. మన రాజకీయ అధికారం! పద్మశాలీ, దేవాంగ, ఇతర చేనేతల మధ్య ఐక్యత బలపడితేనే ఈ లక్ష్యం సాధ్యమవుతుంది. పార్టీలు మారినా సామాజిక బంధం మారకూడదు. రాజకీయ అభిప్రాయాలు వేరైనా చేనేతల హక్కుల విషయంలో గొంతులు ఒక్కటవ్వాలి. ఎందుకంటే ఐక్యత ఉన్నచోటే రాజకీయ బలం ఉంటుంది. రాజకీయ బలం ఉన్నచోటే ప్రాతినిధ్యం సాధ్యమవుతుంది. చేనేత వర్గాల ఐక్యతే రేపటి రాజకీయ శక్తి.. ఆత్మ గౌరవమే ఆ ప్రయాణానికి అసలైన పునాది!



**శిరందాసు నాగార్జున,**
**సీనియర్ జర్నలిస్ట్**
**- 9440222914**



## ఘనంగా టీడీపీ ఎన్నారై జన్మదిన వేడుకలు

వేంపల్లి: టీడీపీ ఎన్నారై నాయకుడు బత్తల గంగరాజు జన్మదిన వేడుకలు వేంపల్లిలో సందడిగా జరిగాయి. బాల్యమిత్రుడు దేవర్ల చంద్రశేఖర్‌రెడ్డి అలియాస్ దిల్ మాంగే, మొండోడు గౌస్ నేతృత్వంలో స్నేహితులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆత్మీయంగా వేడుకలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో రాజకీయంగా కలిసి పనిచేసిన నేతలు, ఈ వేడుకల్లోనూ స్నేహబంధాన్ని చాటుకున్నారు. కేక్ కటింగ్, శుభాకాంక్షలు, ఆత్మీయ పల కరింపులతో సందడి నెలకొంది. గంగరాజుకు దిల్ మాంగేతో ఉన్న చిరకాల బాల్యస్నేహం ఈ సందర్భంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాజ కీయాలకు అతీతంగా వ్యక్తిగత అనుబంధాలకు ప్రాధాన్యమిస్తూ వేడుకల్లో పాల్గొన్న నేతలు ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, మరిన్ని విజయాలు కలగాలని ఆకాంక్షించారు. స్నేహానికి రాజకీయాలు, హోదాలు అడ్డుకావని ఈ వేడుకలు చాటిచెప్పాయి.



## ప్రజల నమ్మకాన్ని నిలబెడతాం: బీటెక్ రవి



పులివెందుల: పులివెందుల మున్సిపాలిటీ, జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీకి విజయాన్ని అందించిన ప్రజలకు ఆ పార్టీ నేత బీటెక్ రవి కృత జ్ఞతలు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టు కుంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ కంచుకోట లింగాల మండలంలోనూ టీడీపీకి విజయం అందించారని, ఎర్రబల్లె చెరువుకు నీరందించడం ఇందుకు కారణమని పేర్కొన్నారు. వేంపల్లి జడ్పీటీసీ స్థానాన్ని పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించడంతో టీడీపీ కార్యకర్తల్లో నిరుత్సాహం ఏర్పడిందని, ప్రచారా నికి తగిన సమయం కేటాయించలేకపోవడం కూడా ఓటమికి కారణమని విశ్లేషించారు. వేములలో కార్యకర్తలు గట్టిగా పోరాడినా స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి ఎదురైందన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని విమర్శిస్తూ, రాబోయే పంచాయతీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థు లను గెలిపించాలని కోరారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ఆదేశాలు జారీ

ప్రొద్దుటూరు: మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'కమి షనర్‌తో ముఖాముఖి' కార్యక్రమంలో ప్రజల నుంచి పలు వినతులు స్వీక రించిన కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్.. రహదారులు, వీధి దీపాలు, తాగునీటి పైప్‌లైన్, మహిళల జిమ్ మరమ్మతులు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిశీ లించి త్వరగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం జరిగే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అగస్త్యేశ్వరాలయంలో వైభవంగా ఆకాశదీపోత్సవం



ప్రొద్దుటూరు: కార్తీక మాసం ప్రారంభాన్ని పుర స్కరించుకుని ప్రొద్దుటూరులోని శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం ఆకాశదీపోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు దీపం వెలిగించి ఉత్స వాలకు శ్రీకారం చుట్టారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, ఆలయ ప్రాంగణంలో మిరపణి నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్ర మంలో ఆలయ ఈఓ కేవీ రమణ, చైర్మన్ వంగల నారాయణరెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

## దీపావళి టపాసులపై వివాదం

**గాలి నాణ్యతపై రాజకీయ రగడ**



**సుప్రీంకోర్టు నిబంధనలు అమలు చేశాం**

శబ్ద కాలుష్యంపై సుప్రీంకోర్టు మార్గదర్శకా లను అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని సువేందు అధికారి తెలిపారు. రాత్రి 10 గంటల తర్వాత కొన్ని ప్రాంతాల్లో టపాసులు కాల్చినప్పటికీ, బాధ్యులపై పోలీసులు చర్యలు తీసుకున్నారని చెప్పారు. పరిస్థితి చాలావరకు అదుపులోనే ఉందని పేర్కొన్నారు. మరోవైపు, బీజేపీ ఎమ్మెల్యే పాపియా అధికారి టపాసులు కాల్చడం వల్ల అనేక వ్యాధులు నయమవుతాయని వ్యాఖ్యానించి వివాదానికి తెరతీశారు. కోల్ కతాలోని టోలీగంజ్ నియోజకవర్గంలో జరిగిన కాళీపూజ కార్యక్రమంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. పర్యావరణ కాలుష్యంపై ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజల ప్రశ్నలకు బదులుగా ఇలాంటి వాదనలు రావడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

**కాలుష్యంపై ప్రశ్నిస్తే కమ్యూనిస్టులా?**

**బీజేపీ నేతల వింత వాదనలు!**

కోల్ కతాలో దీపావళి వేడుకల సందర్భంగా వాయు, శబ్ద కాలుష్యం తీవ్ర స్థాయికి చేరడం రాజకీయ వివాదా నికి దారితీసింది. పలు ప్రాంతాల్లో వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 500 దాటగా, శబ్ద తీవ్రత కూడా అనుమతిం చిన పరిమితులను మించింది. నిబంధనలకు విరుద్ధంగా టపాసులు కాల్చినందుకు పోలీసులు సుమారు 205 మందిని అరెస్టు చేశారు. ఈ పరిస్థితిపై నగరవాసులు సామాజిక మాధ్యమాల్లో ఆందోళన వ్యక్తం చేయగా, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి విమ ర్శకులపై ఎదురుదాడికి దిగారు. కమ్యూనిస్టులు, సనాతన ధర్మాన్ని విశ్వసించని వారే హిందూ పండుగ లపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని వ్యాఖ్యానిం చారు. దీపావళి సందర్భంగా గ్రీన్ క్రాకర్స్ కాల్చడంలో తప్పేముందని ప్రశ్నించారు.

**గులాబీ నీటితో కాలుష్యం తగ్గుతుందా?**

రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి అగ్నిమిత్ర పాల్ గతంలో గులాబీ నీటిని సాధారణ నీటితో కలిపి పిచికారీ చేస్తే కాలుష్యం తగ్గుతుందని సూచించడం పర్యావరణవే త్తల విమర్శలకు కారణమైంది. అయితే దీపావళి రాత్రి ఆమె స్వయంగా పోలీసులతో కలిసి పరిస్థితిని పరిశీ లించి, పోలీస్ కమిషనర్ జోక్యం కోరారు. బీజేపీ ఎమ్మెల్యే రూపా గంగూలీ సైతం టపాసుల శబ్దంతో నిద్రపోలేకపో తున్నానని సామాజిక మాధ్యమాల్లో పోలీసులను సాయం కోరారు. అనంతరం ఆ పోస్టును తొలగించారు. మరోవైపు పర్యావరణ సంస్థ సబుజ్ మంచా ప్రతినిధులు ఆసుపత్రులను సందర్శించి, శబ్ద తీవ్రత అనుమతించిన స్థాయిని మించిందని గుర్తించారు. నిబంధనలను కఠినంగా అమలు చేయాలని కోల్‌కతా పోలీసులను, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కాలుష్యంపై ప్రజల ఆందోళ నకు రాజకీయ విమర్శలు, వింత పరిష్కారాలే సమాధా నాలుగా మారడం చర్చనీయాంశమైంది.



# నాడు టీడీపీ బహిష్కరణ.. నేడు వైసీపీ పోరాటం!

**ఒకప్పుడు స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయదుందుభి మోగించింది. టీడీపీని ప్రజలు తిరస్కరించారని, జగన్ పాలనకు తిరుగులేని మద్దతు పలికారని అప్పటి మంత్రులు ప్రకటించారు. కానీ రెండేళ్లకే రాజకీయ చిత్రం తలకిందులైంది. 2024లో వైసీపీ 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైంది. ఇప్పుడు సీన్ మారింది! అధికారంలో టీడీపీ కూటమి.. ప్రతిపక్షంలో వైఎస్సార్‌సీపీ! నాడు ఎన్నికల ప్రక్రియపై అభ్యంతరాలతో టీడీపీ పరిషత్ ఎన్నికలను బహిష్కరించింది. నేడు అదే తరహా ఆరోపణలు చేస్తున్న వైసీపీ మాత్రం ఎన్నికల బరిలో నిలిచి పోరాడింది. ఫలితాలు మాత్రం అధికార కూటమికి అనుకూలంగా వచ్చాయి. మరి ఈ విజయమే 2029 అసెంబ్లీ ఎన్నికలకు సంకేతమా? స్థానిక ఎన్నికల్లో గెలిచినంత మాత్రాన రాష్ట్ర ప్రజల మనసులు గెలిచినట్టేనా? నాడు జగన్ చేసిన రాజకీయ వాదననే నేడు చంద్రబాబు వినిపిస్తున్నారా? మరోవైపు వైసీపీకి ఇది ఆత్మపరిశీలన సమయమా? గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే.. ఎన్నికల రాజకీయాల్లో చివరి ఆరు నెలలు అనేక సమీకరణాలను మార్చగలవు. నిన్నటి విజేత రేపటి ఓటమిపాలవచ్చు.. నేటి ఓటమి రేపటి విజయానికి పునాదికావచ్చు! అసలు రాజకీయ లెక్కలు ఏమిటి? నాడు ఎవరు ఏం చేశారు.. నేడు ఎవరు ఏం చేస్తున్నారు?**

- ఎన్నికల బరిలో అసలు రాజకీయ ముఖచిత్రం ఇదే!
- రెండూ స్థానిక ఎన్నికలే.. కానీ పరిస్థితులు వేరు!
- స్థానిక విజయమా? అసెంబ్లీ తీర్పా? ఏది ముఖ్యం..!?

**• నేటి విజయం శాశ్వతం కాదు.. రేపటి రాజకీయాలకు అనేక మలుపులు**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎన్నికలకు ముందు మారే పొత్తులు, రాజకీయ వ్యూహాలు ఫలితాలను ప్రభావితం చేస్తాయి. 2024 అసెంబ్లీ ఎన్నికలే ఇందుకు ఉదాహరణ. గతంలో వేర్వేరుగా ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ ఎన్నికల సమయానికి కూటమిగా ఏర్పడ్డాయి. పవన్ కళ్యాణ్ చొరవ, చంద్రబాబు నాయకత్వం, బీజేపీ భాగస్వామ్యం, సీట్ల సర్దుబాటు, ఉమ్మడి ప్రచారం కూటమి రాజకీయాలకు కొత్త రూపునిచ్చాయి. వైఎస్సార్‌సీపీ మాత్రం ఒంటరిగా పోటీ చేయడంతో రాష్ట్రంలో అధికార మార్పు జరిగింది. అందుకే 2026 స్థానిక ఎన్నికల ఫలితాల ఆధారంగా 2029 అసెంబ్లీ ఎన్నికల రాజకీయ చిత్రాన్ని ఇప్పుడే నిర్ణయించలేం. రాబోయే మూడేళ్లలో కూటమి ప్రభుత్వం హామీల అమలు, ఉద్యోగాల కల్పన, రైతుల సమస్యలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ధరల నియంత్రణ వంటి అంశాల్లో ఎలా వ్యవహరిస్తుందన్నది ప్రజల అభిప్రాయాలను ప్రభావితం చేయవచ్చు. మరోవైపు వైఎస్సార్‌సీపీ 2024 ఓటమికి కారణాలను విశ్లేషించుకుని, నాయకత్వాన్ని బలోపేతం చేసుకోవడం, ప్రజా సమస్యలపై పోరాడటం, కార్యకర్తల్లో విశ్వాసం పెంచుకోవడం వంటి సవాళ్లను ఎదుర్కోవాలి. 2021లో జగన్ ప్రభుత్వం స్థానిక విజయాలను ప్రజాదరణకు నిదర్శనంగా చూపితే, 2026లో చంద్రబాబు ప్రభుత్వం కూటమి బలానికి సంకేతంగా చూపుతోంది. నాడు టీడీపీ ఎన్నికలను బహిష్కరించగా, నేడు వైఎస్సార్‌సీపీ పోటీలో నిలిచింది. అయితే స్థానిక ఎన్నికల్లో గెలుపు అసెంబ్లీ విజయానికి హామీ కాదు. ముఖ్యంగా ఎన్నికలకు ముందు చివరి ఆరు నెలల్లో పొత్తులు, అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలు, ప్రజల అభిప్రాయాలు కొత్త రాజకీయ మలుపులకు కారణం కావచ్చు. నేటి స్థానిక విజయం రేపటి అసెంబ్లీ తీర్పు కాదు.. అంతిమ నిర్ణేతలు ప్రజలే!

**నాడు జగన్‌కు స్థానిక విజయాలే కొలమానం.. నేడు చంద్రబాబుకు స్థానిక విజయాలే రాజకీయ బలం! అసెంబ్లీ ఎన్నికలకు స్థానిక ఎన్నికలకు మధ్య ఉన్న వ్యత్యాసం ఏమిటి? నాడు టీడీపీ ఎందుకు బహిష్కరించింది? నేడు వైఎస్సార్‌సీపీ ఎందుకు పోరాడింది? అధికారంలో ఉన్న పార్టీకి స్థానిక ఎన్నికల్లో వచ్చే విజయాన్ని అసెంబ్లీ ఎన్నికల విజయంగా భావించవచ్చా? 2029 రాజకీయ సమీకరణాలను ఇప్పుడే నిర్ణయించవచ్చా? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం వెతికే ప్రయత్నమే ఈ రాజకీయ విశ్లేషణ.**

2021 ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికలు అప్పటి అధికార వైఎస్సార్‌సీపీకి రాజకీయంగా కీలకమైనవి. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 151 స్థానాలు సాధించి అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రెండేళ్ల పాలన తర్వాత స్థానిక ఎన్నికలను ఎదుర్కొంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ భారీ విజయాలు నమోదు చేసింది. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 52.63 శాతం ఓట్లు రాగా, తెలుగుదేశం పార్టీకి 30.73 శాతం వచ్చాయి. జనసేన 4.67 శాతం, బీజేపీ 2.41 శాతం ఓట్లు సాధించాయి. అంటే నాడు టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలకు వచ్చిన ఓట్లను కలిపి లెక్కిస్తే 37.81 శాతం మాత్రమే. వైఎస్సార్‌సీపీతో పోలిస్తే 14.82 శాతం పాయింట్ల తేడా కనిపించింది. వార్డుల విషయానికి వస్తే వైఎస్సార్‌సీపీ 2,265 స్థానాలు గెలుచుకోగా, టీడీపీ 349 స్థానాలకే పరిమితమైంది. వైఎస్సార్‌సీపీ 73 మున్సిపాలిటీలు, 11 కార్పొరేషన్లలో విజయం సాధించాయి. ఈ ఫలితాలతో అప్పటి మంత్రులు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాష్ట్రంలో టీడీపీని ప్రజలు తిరస్కరించారని ప్రకటించారు. జగన్ పాలనకు ప్రజలు మద్దతు పలికారని, స్థానిక సంస్థల ఫలితాలు తమ ప్రభుత్వంపై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని ప్రచారం చేశారు. అయితే అదే సమయంలో ఒక ముఖ్యమైన అంశాన్ని విస్మరించకూడదు. స్థానిక ఎన్నికల్లో అధికారంలో ఉన్న పార్టీకి పరిపాలనా యంత్రాంగం, స్థానిక నాయకత్వం, గ్రామస్థాయి కార్యకర్తల బలం, ప్రభుత్వ పథకాల ప్రభావం వంటి అంశాలు అనుకూలంగా పనిచేస్తాయి. అందుకే స్థానిక ఎన్నికల్లో వచ్చిన విజయాన్ని నేరుగా అసెంబ్లీ ఎన్నికల విజయానికి సమానంగా చూడలేం. 2021లో వైఎస్సార్‌సీపీ సాధించిన పట్టణ విజయాలు వాస్తవమే. కానీ అవే 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఏం జరిగిందో చూశాం.

**• నాడు పరిషత్ ఎన్నికలకు టీడీపీ దూరం.. పోటీలో నిలిచిన కొందరు అభ్యర్థులు**

2021లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సమయంలో టీడీపీ ఎన్నికల ప్రక్రియపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. అధికార పార్టీ ఒత్తిళ్లు, బెదిరింపులు, అధికార యంత్రాంగం వ్యవహారశైలిపై ఆరోపణలు చేస్తూ ఎన్నికలను బహిష్కరించాలని చంద్రబాబు నాయకత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం రాజకీయంగా అప్పట్లో పెద్ద చర్చకు దారితీసింది. ప్రజాస్వామ్యంలో ఎన్నికలపై అభ్యంతరాలు ఉంటే వాటిని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లడం, న్యాయపరంగా పోరాడటం ఒక మార్గం. అయితే ఎన్నికల బరిలో నుంచి తప్పుకోవడం మరో నిర్ణయం. టీడీపీ రెండో మార్గాన్ని ఎంచుకుంది. కానీ అప్పటికే నామినేషన్లు వేసిన అభ్యర్థులందరూ పోటీ నుంచి తప్పుకోలేదు. అందువల్ల బహిష్కరణ ప్రకటన ఉన్నప్పటికీ టీడీపీకి కొన్ని స్థానాలు వచ్చాయి. 2021లో పోలింగ్ జరిగిన ఎంపీటీసీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీకి 5,992, టీడీపీకి 827, జనసేనకు 179, బీజేపీకి 28 స్థానాలు లభించాయి. జడ్పీటీసీల్లో వైఎస్సార్‌సీపీ 504, టీడీపీ 6, జనసేన 2 స్థానాలు సాధించాయి. ఇవి పోలింగ్ జరిగిన స్థానాల లెక్కలు మాత్రమే. ఏకగ్రీవంగా ఎన్నికైన 126 జడ్పీటీసీ, 2,371 ఎంపీటీసీ స్థానాలను ఈ సంఖ్యల్లో కలపలేదు. ఇక్కడే అసలు రాజకీయ అంశం ఉంది. టీడీపీ బహిష్కరణ నిర్ణయం తీసుకున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి వచ్చిన స్థానాలను రెండు పార్టీల మధ్య పూర్తిస్థాయి ప్రత్యక్ష పోటీ ఫలితంగా పరిగణించలేం. అదే సమయంలో బహిష్కరణ నిర్ణయంతో టీడీపీకి ఎన్నికల ద్వారా తన బలాన్ని నిరూపించుకునే అవకాశం పరిమితమైంది. నాడు వైఎస్సార్‌సీపీ నేతలు ఈ ఫలితాలను తమ ప్రజాదరణకు నిదర్శనంగా ప్రచారం చేశారు. టీడీపీ మాత్రం ఎన్నికల నిర్వహణపై అభ్యంతరాలను ప్రధానంగా ప్రస్తావించింది. నాడు అధికారంలో ఉన్న పార్టీకి వచ్చిన స్థానాలు ఒక అంశమైతే, ప్రధాన ప్రతిపక్షం ఎన్నికల బహిష్కరణ నిర్ణయం మరో అంశం. ఈ రెండింటినీ కలిపి చూసినప్పుడే ఆ ఎన్నికల అసలు నేపథ్యం అర్థమవుతుంది.

**• నేడు వైఎస్సార్‌సీపీ పోటీ చేసింది? అధికారపక్షాన్ని ఎదుర్కొంది!**

2026 స్థానిక సంస్థల ఎన్నికల్లో పరిస్థితులు మారాయి. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన వైఎస్సార్‌సీపీ ఇప్పుడు ప్రతిపక్ష స్థానంలో ఉంది. మరోవైపు టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి అధికార కూటమిగా పాలన సాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్, కార్పొరేషన్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల ప్రక్రియపై వైఎస్సార్‌సీపీ పలు అభ్యంతరాలు వ్యక్తం చేసింది. నామినేషన్ల సమయంలో అడ్డంకులు, బెదిరింపులు, అధికారుల ఒత్తిళ్లు, పోలింగ్, ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయని ఆ పార్టీ ఆరోపించింది. అయితే 2021లో టీడీపీ తీసుకున్న బహిష్కరణ నిర్ణయం తరహాలో వైఎస్సార్‌సీపీ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల నుంచి తప్పుకోలేదు. అభ్యర్థులను నిలబెట్టింది. ప్రచారం చేసింది. పోటీ చేసింది. ఫలితాలను ఎదుర్కొంది. పరిషత్ ఎన్నికల్లో పోలింగ్ జరిగిన 582 జడ్పీటీసీ స్థానాల్లో టీడీపీ 406, జనసేన 73, బీజేపీ 20 స్థానాలు గెలుచుకున్నాయి. వైఎస్సార్‌సీపీకి 76 స్థానాలు వచ్చాయి. 7,768 ఎంపీటీసీ స్థానాల్లో టీడీపీ 4,806, జనసేన 938, బీజేపీ 117 స్థానాలు సాధించగా, వైఎస్సార్‌సీపీ 1,711 స్థానాలు గెలుచుకుంది. అంటే మూడు పార్టీల కూటమికి 5,861 ఎంపీటీసీ, 499 జడ్పీటీసీ స్థానాలు లభించాయి. ఇవి పోలింగ్ జరిగిన స్థానాల ఆధారంగా ప్రకటించిన ఫలితాలు. ఏకగ్రీవ స్థానాలను కలిపితే లెక్కలు మారతాయి. రాజకీయంగా మాత్రం ఒక విషయం స్పష్టంగా కనిపిస్తోంది. 2021లో టీడీపీ బహిష్కరణ నిర్ణయం తీసుకున్న చోట 2026లో వైఎస్సార్‌సీపీ ఎన్నికల్లో నిలబడింది. గెలుపు రాకపోయినా పోటీ నుంచి తప్పుకోలేదు. ఈ రెండు పార్టీల వ్యూహాల మధ్య ఉన్న తేడా ఇదే. ఎన్నికల్లో పాల్గొనడం ఒక్కటే విజయానికి హామీ కాదు. కానీ పోటీ చేయడం ద్వారా పార్టీకి తన ఓటు పునాది, కార్యకర్తల బలం, నియోజకవర్గాల స్థితిగతులు తెలుసుకునే అవకాశం ఉంటుంది.

**• నేడు టీడీపీ ఏం చేసింది? అధికార బలంతో స్థానిక విజయాల లెక్క!**

2026 స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ గణనీయమైన స్థానాలను సాధించింది. ముఖ్యంగా పరిషత్ ఎన్నికల గణాంకాలను పరిశీలిస్తే జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో కూటమి ఆధిక్యం స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 659 జడ్పీటీసీ స్థానాలకు గాను 77 స్థానాలు ఏకగ్రీవం కాగా, 582 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఎన్నికలు జరిగిన స్థానాల్లో టీడీపీ 407, జనసేన 71, బీజేపీ 20 స్థానాలు గెలుచుకున్నాయి. అంటే మూడు పార్టీల కూటమి 498 స్థానాలను సాధించగా, వైఎస్సార్‌సీపీ 76, ఇతరులు 7 స్థానాలు గెలుచుకున్నారు. ఇక ఎంపీటీసీ ఎన్నికల్లో మొత్తం 9,821 స్థానాలకు గాను 2,051 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. 7,767 స్థానాలకు ఎన్నికలు జరిగినట్లు అందుబాటులో ఉన్న గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వీటిలో టీడీపీ 4,806, జనసేన 938, బీజేపీ 117 స్థానాలు గెలుచుకున్నాయి. దీంతో కూటమి పార్టీల ఖాతాలో 5,845 ఎంపీటీసీ స్థానాలు చేరాయి. వైఎస్సార్‌సీపీ 1,711, ఇతరులు 197 స్థానాలు సాధించారు. ఏకగ్రీవాలను కలపకుండా కేవలం ఎన్నికలు జరిగిన స్థానాల్లోనే కూటమి 5,845 ఎంపీటీసీ, 499 జడ్పీటీసీ స్థానాలను సాధించడం గమనార్హం. అయితే ఈ విజయాన్ని కేవలం ప్రభుత్వ పనితీరుకు మాత్రమే ఆపాదించలేం. అధికారంలో ఉండటం, మూడు పార్టీల మధ్య సమన్వయం, స్థానిక నాయకత్వం, అభ్యర్థుల ఎంపిక వంటి అంశాలు కూడా ఫలితాలను ప్రభావితం చేస్తాయి. మరోవైపు వైఎస్సార్‌సీపీ ఎన్నికల బరిలో నిలిచి పోరాడినప్పటికీ సీట్ల పరంగా వెనుకబడింది. ఇక్కడ గుర్తించాల్సిన విషయం ఒక్కటే.. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ సాధించిన ఆధిక్యం రాజకీయంగా ముఖ్యమైనదే. కానీ ఈ విజయమే అసెంబ్లీ ఎన్నికల్లోనూ పునరావృతమవుతుందని ఇప్పుడే నిర్ణయించలేం. ప్రజల అంతిమ తీర్పు ప్రభుత్వ పాలన, ప్రజా సమస్యలు, మారే రాజకీయ సమీకరణాలపై ఆధారపడి ఉంటుంది.

**• స్థానిక ఎన్నికలు వేరు.. అసెంబ్లీ ఎన్నికలు వేరు!**

ఇక్కడే అసలు రాజకీయ విశ్లేషణ మొదలవుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచిన పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలుస్తుందని చెప్పలేం. అలాగే స్థానిక ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఓడిపోతుందని నిర్ణయించలేం. దీనికి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలోనే ఉదాహరణలు ఉన్నాయి. 2021లో వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీ విజయాలు సాధించింది. ఆ సమయంలో పార్టీ నేతలు టీడీపీని ప్రజలు తిరస్కరించారని, జగన్ ప్రభుత్వానికి తిరుగులేని మద్దతు ఉందని ప్రచారం చేశారు. కానీ 2024 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు పూర్తిగా భిన్నంగా వచ్చాయి. 2019లో 151 అసెంబ్లీ స్థానాలు సాధించిన వైఎస్సార్‌సీపీ 2024లో 11 స్థానాలకే పరిమితమైంది. మరోవైపు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి 164 స్థానాలు గెలుచుకుంది. అంటే 2021 స్థానిక ఎన్నికల్లో నమోదైన వైఎస్సార్‌సీపీ ఆధిక్యం 2024 అసెంబ్లీ ఎన్నికల్లో అదే స్థాయిలో కొనసాగలేదు. ఈ మార్పును అర్థం చేసుకోవడానికి అసెంబ్లీ ఎన్నికల ప్రత్యేకతను గుర్తించాలి. స్థానిక ఎన్నికల్లో ఒక వార్డు, ఒక గ్రామం, ఒక మండలం, ఒక పట్టణం కేంద్రంగా పోటీ జరుగుతుంది. అభ్యర్థి వ్యక్తిగత పరిచయాలు, స్థానిక సమస్యలు, సామాజిక సమీకరణాలు, గ్రామస్థాయి నాయకుల ప్రభావం కీలకంగా ఉంటాయి. అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం నియోజకవర్గం మొత్తం ఓటర్లు అభ్యర్థితో పాటు పార్టీ నాయకత్వం, ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ఉద్యోగాలు, ధరలు, నిరుద్యోగం, సామాజిక న్యాయం వంటి అనేక అంశాలపై తీర్పు ఇస్తారు. ముఖ్యమంత్రి నాయకత్వం, కూటమి బలం, ప్రతిపక్షాల ఐక్యత, ప్రచార వ్యూహం కూడా ఫలితాలను ప్రభావితం చేస్తాయి. స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి ఉండే అనుకూలత అసెంబ్లీ ఎన్నికల్లో తప్పనిసరిగా కొనసాగుతుందని భావించలేం. అలాగే ప్రతిపక్షానికి స్థానికంగా వచ్చిన ఓటమి రాష్ట్రవ్యాప్తంగా దాని రాజకీయ ఉనికి ముగిసిందని అర్థం కాదు. అందుకే 2026 స్థానిక ఎన్నికల ఫలితాలను 2029 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు ముందస్తు తీర్పుగా చూడటం సరైన పద్ధతి కాదు. స్థానిక ఎన్నికలు ప్రస్తుత రాజకీయ స్థితిని చూపుతాయి. అసెంబ్లీ ఎన్నికలు ఐదేళ్ల పాలనపై ప్రజల సమగ్ర తీర్పును ప్రతిబింబిస్తాయి. ఈ రెండింటి మధ్య తేడాను గుర్తించడమే నిజమైన రాజకీయ విశ్లేషణ.








## తెరపైకి వీరభద్రస్వామి!

# మఠంలో పీఠం కోసం మహాసంగ్రామం!

- ముగ్గురు వారసులు.. మూడు వాదనలు..
- 315 ఏళ్ల మఠంలో మళ్లీ వారసత్వ పోరు
- బ్రహ్మంగారి మఠం పీఠాధిపత్యంపై మళ్లీ రచ్చ
- రెండో కుమారుడి వాదనకు న్యాయస్థానం పట్టం!
- వెంకటాద్రిస్వామి నియామకం రద్దుతో కొత్త ట్విస్ట్
- హైకోర్టు సంచలన ఉత్తర్వులతో పీఠం పోస్ట్‌పై హీట్



**ఆంధ్రప్రదేశ్‌లోని బ్రహ్మంగారి మఠంలో పీఠాధిపత్య వివాదం మరోసారి కీలక మలుపు తిరిగింది. ఇన్నాళ్లూ పెద్ద కుమారుడు నొస్సం వెంకటాద్రిస్వామి చుట్టూ సాగిన వారసత్వ పోరులోకి ఇప్పుడు రెండో కుమారుడు నొస్సం వీరభద్రస్వామి బలంగా ప్రవేశించారు. దివంగత పీఠాధిపతి శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామివారు తననే తదుపరి పీఠాధిపతిగా ఎంపిక చేశారని పేర్కొంటూ ఆయన న్యాయపోరాటం చేస్తున్నారు. తన సోదరుడు వెంకటాద్రిస్వామికి ధార్మిక పరిషత్ ఇచ్చిన తాత్కాలిక మఠాధిపతి నియామకాన్ని సవాలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 2026 జనవరి 13న వెంకటాద్రిస్వామి నియామకానికి సంబంధించిన ఉత్తర్వులను నవంబర్ 4న రద్దు చేసింది. దీంతో ఐదేళ్లుగా కొనసాగుతున్న వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. అయితే ఈ తీర్పుతో వీరభద్రస్వామికి పీఠాధిపత్యం ఖరారైనట్లు కాదు. ఆయనతో పాటు ఇతర అభ్యర్థుల హక్కులు, అర్హతలను చట్టప్రకారం పరిశీలించాల్సి ఉంది. మఠాధిపతి ఎంపికలో కుటుంబ పెద్దరికమే ఏకైక ప్రమాణం కాదని, ఆధ్యాత్మిక అర్హతలు, మఠ సంప్రదాయాలు, శిష్యుల అభిప్రాయాలు, చట్టబద్ధమైన విధానానికి ప్రాధాన్యం ఇవ్వాలని హైకోర్టు స్పష్టం చేసింది. 315 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ మఠానికి తదుపరి పీఠాధిపతి ఎవరన్న ఉత్కంఠ భక్తుల్లో పెరుగుతోంది. వీరభద్రస్వామి తన హక్కును బలంగా వినిపించడంతో పోరుకు కొత్త ఊపు వచ్చింది. పెద్ద కుమారుడి నియామకంతో వివాదం ముగిసిందన్న అంచనాలు తలకిందులయ్యాయి. మరోవైపు గోవిందస్వామి వాదన కూడా ఇంకా పరిశీలనలోనే ఉంది. దీంతో ముగ్గురు వారసుల మధ్య పీఠాధిపత్య పోరు మరింత ఆసక్తికరంగా మారింది. ఈ పరిణామం కుటుంబ వారసత్వ వివాదానికే పరిమితం కాకుండా మఠ ఆధ్యాత్మిక భవిష్యత్తును నిర్ణయించే కీలక ఘట్టంగా మారింది. భక్తుల చూపు దీనిపైనే.**

### • కుటుంబంలో ముగ్గురు వారసులు.. ఐదేళ్లుగా కొనసాగుతున్న న్యాయపోరాటం!

శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారు స్థాపించిన బ్రహ్మంగారి మఠానికి తెలుగు రాష్ట్రాల్లో విశిష్ట ఆధ్యాత్మిక గుర్తింపు ఉంది. కాలజ్ఞాన రచనలతో ప్రపంచవ్యాప్త ఖ్యాతి పొందిన బ్రహ్మంగారి బోధనలు ఈ మఠానికి ప్రత్యేకత. 11వ పీఠాధిపతిగా శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామివారు 1969 నుంచి సేవలందించారు. 2021 మే 8న ఆయన మరణంతో వారసత్వ వివాదం మొదలైంది. మొదటి భార్య చంద్రావతమ్మకు నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు; రెండో భార్య మారుతి మహాలక్ష్మమ్మకు ఇద్దరు కుమారులు ఉన్నారు. దీంతో పీఠాధిపత్యంపై ముగ్గురు వారసుల వాదనలు తెరపైకి వచ్చాయి. మొదటి భార్య పెద్ద కుమారుడు నొస్సం వెంకటాద్రిస్వామి కుటుంబ సంప్రదాయం ప్రకారం పీఠం తనకే దక్కాలని కోరుతున్నారు. మరో కుమారుడు నొస్సం వీరభద్రస్వామి 2018లో తండ్రి రాసిన వీలునామాను ఆధారంగా చూపుతున్నారు. రెండో భార్య పెద్ద కుమారుడు గోవిందస్వామి మాత్రం 2006లో తండ్రి తనను వారసుడిగా పేర్కొన్నారని చెబుతున్నారు. ఇలా ముగ్గురూ వేర్వేరు ఆధారాలతో హక్కు కోరడంతో వివాదం జటిలమైంది. దేవాదాయ శాఖ జోక్యం చేసుకుని ఫిట్ పర్సన్‌ను నియమించినా, కుటుంబ అభ్యంతరాలు న్యాయపోరాటానికి దారితీశాయి. పరుస పిటిషన్లతో మఠాధిపతి ఎంపిక కోర్టుల పరిధిలోకి వెళ్లింది. ఐదేళ్లుగా పలు పరిణామాలు చోటుచేసుకున్నా శాశ్వత పరిష్కారం దక్కలేదు.

తండ్రి ఎవరిని వారసుడిగా గుర్తించారు? మఠ సంప్రదాయాలకు అనుగుణంగా ఎవరు అర్హులు? అన్నదే ఇప్పుడు కీలకం. వీలునామా, నామినేషన్ పత్రాలు, కుటుంబ ఆచారాలు తమకు అనుకూలమని ముగ్గురూ వాదిస్తున్నారు. అయితే వారసత్వ హక్కుల నిర్ధారణకు పత్రాల చట్టబద్ధతపై న్యాయపరమైన పరిశీలన తప్పనిసరి. కుటుంబ సభ్యుడిగా ఉండటం లేదా పెద్ద కుమారుడిగా జన్మించడం మాత్రమే పీఠాధిపత్యానికి హామీ కాదని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. మఠం ఆధ్యాత్మిక వారసత్వాన్ని కొనసాగించే బాధ్యత ఎవరికి అప్పగించాలన్నది కూడా ఈ ఎంపికలో కీలకంగా మారింది. ఈ ప్రశ్నకు సమాధానం ఇంకా రావాల్సి ఉంది.

### • 2018 వీలునామానే ప్రధాన ఆధారం.. తండ్రి తననే ఎంపిక చేశారంటున్న వీరభద్రస్వామి!

తాజా న్యాయపోరాటంలో నొస్సం వీరభద్రస్వామి వాదన కీలకంగా మారింది. తన తండ్రి తననే తదుపరి మఠాధిపతిగా ఎంపిక చేశారని చెబుతూ 2018 నవంబర్ 10న రాసిన వీలునామాను ప్రధాన ఆధారంగా చూపిస్తున్నారు. ఈ విషయాన్ని తన తండ్రి 2018 నవంబర్ 28న ధార్మిక పరిషత్‌కు తెలియజేశారని, డిసెంబర్ 1న కొరియర్ ద్వారా కూడా సమాచారం పంపారని ఆయన తరఫు న్యాయవాదులు కోర్టులో వివరించారు. తండ్రి జీవించి ఉండగానే తనను వారసుడిగా గుర్తించినప్పుడు, ఆ నిర్ణయాన్ని పక్కనపెట్టి పెద్ద కుమారుడికి తాత్కాలిక బాధ్యతలు అప్పగించడం సరికాదన్నది ఆయన వాదన. ఈ అంశంపై 2021లోనే అధికారుల నిర్ణయాలను సవాలు చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మరోవైపు మఠాధిపతి పదవికి కుటుంబ వారసత్వమే కాకుండా బ్రహ్మంగారి తత్వబోధనలు, కాలజ్ఞానం, మఠ సంప్రదాయాలపై లోతైన అవగాహన అవసరమని ఆయన వర్గం వాదిస్తోంది. దివంగత పీఠాధిపతికి వీరభద్రస్వామితో ప్రత్యేక అనుబంధం ఉండేదన్న ప్రచారం కూడా ఉంది. మొదటి భార్య చంద్రావతమ్మ కిడ్నీ వ్యాధితో బాధపడినప్పుడు మార్పిడి కోసం వీరభద్రస్వామి తన కిడ్నీ దానం చేశారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఈ ఘటనతో తల్లి, కుమారుడి అనుబంధం బలపడటంతో పాటు తండ్రి కూడా ఆయనను ప్రత్యేకంగా ఆదరించేవారని అనుచరుల వాదన.

అయితే ఈ వైద్యపరమైన అంశాలు హైకోర్టు తీర్పులో నిర్ధారణ కాలేదు. అంతేకాకుండా తండ్రి వద్దనే బ్రహ్మంగారి తత్వబోధనలు, కాలజ్ఞాన పఠనం, వేద పారాయణం, మఠ సంప్రదాయాలపై అపగాహన పొందారని, గురూపదేశం కూడా ఆయన నుంచే లభించిందని వీరభద్రస్వామి వర్గం పేర్కొంటోంది. ఈ అర్హతలతో మఠ ఆధ్యాత్మిక వారసత్వాన్ని కొనసాగించే సామర్థ్యం తనకు ఉందని ఆయన భావిస్తున్నారు. అయితే వీలునామా చెల్లుబాటు, వారసత్వ హక్కు, మఠాధిపతి పదవికి అవసరమైన ఆధ్యాత్మిక అర్హతలు వేర్వేరు అంశాలు. వీటిని సంబంధిత అధికారులు, అవసరమైతే న్యాయస్థానాలు విడివిడిగా పరిశీలించాల్సి ఉంటుంది.

### • పెద్ద కుమారుడి నియామకానికి గట్టి ఎదురుదెబ్బ.. గోవిందస్వామి నామినేషన్ కూడా తెరపైకి!

ఇప్పటివరకు బ్రహ్మంగారి మఠం పీఠాధిపత్య వివాదంలో ప్రధానంగా వినిపించిన పేరు నొస్సం వెంకటాద్రిస్వామి. మొదటి భార్యకు పెద్ద కుమారుడైనందున కుటుంబ సంప్రదాయం ప్రకారం పీఠాధిపత్యం తనకే దక్కాలని ఆయన వాదించారు. తండ్రి మరణించిన 13వ రోజున సంప్రదాయబద్ధంగా పట్టాభిషేకం నిర్వహించుకున్నట్లు, గతంలో మఠంలో సేవలందించి దివంగత పీఠాధిపతికి సహకరించినట్లు పేర్కొన్నారు. ఈ వాదనలతో 2026 జనవరి 13న ధార్మిక పరిషత్ ఆయనను తాత్కాలిక మఠాధిపతిగా నియమించింది. అయితే ఈ నియామకాన్ని సవాలు చేస్తూ వీరభద్రస్వామి, గోవిందస్వామి, తుర్లపాటి సాంబశివరావు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. మఠ శిష్యులకు, అదే సంప్రదాయానికి చెందిన ఇతర మఠాల పీఠాధిపతులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ఎంపిక ప్రక్రియ చేపట్టారని, పెద్ద కుమారుడనే కారణంతో నియామకం చేయడం చట్టవిరుద్ధమని అభ్యంతరాలు వ్యక్తం చేశారు. వెంకటాద్రిస్వామికి అవసరమైన ఆధ్యాత్మిక పరిజ్ఞానం లేదని కూడా ఆరోపించారు. ఇవి పిటిషనర్ల వాదనలు మాత్రమే కాగా, వెంకటాద్రిస్వామి వాటిని ఖండించారు. మరోవైపు రెండో భార్య మారుతి మహాలక్ష్మమ్మ పెద్ద కుమారుడు గోవిందస్వామి కూడా వారసత్వ హక్కు కోసం పోరాడుతున్నారు. తన తండ్రి 2006లో ప్రత్యేక కాగితంపై తనను వారసుడిగా పేర్కొన్నారని, వ్యక్తిగత డైరీలోనూ నమోదు చేశారని చెబుతున్నారు. ఆ పత్రాలు తండ్రి గదిలోని ఇనుప బీరువాలో భద్రపరిచారని, అధికారులు దానిని స్వాధీనం చేసుకున్నారని వాదిస్తున్నారు. తన తల్లి 2021 జూన్ 25, 26 తేదీల్లో ధార్మిక పరిషత్‌కు వినతిపత్రాలు సమర్పించి తనను మఠాధిపతిగా గుర్తించాలని కోరినట్లు తెలిపారు. దీంతో ఇప్పుడు ముగ్గురి వాదనలు కీలకంగా మారాయి. 2018 వీలునామాతో వీరభద్రస్వామి, 2006 నామినేషన్‌తో గోవిందస్వామి, కుటుంబ సంప్రదాయంతో వెంకటాద్రిస్వామి పీఠాధిపత్యాన్ని కోరుతున్నారు. అయితే ఎవరి పత్రాలు చెల్లుబాటవుతాయి? ఎవరు ఆధ్యాత్మికంగా అర్హులు? అన్నది ఇంకా తేలాల్సి ఉంది. హైకోర్టు తాజా ఉత్తర్వులు ఈ హక్కులపై తుది నిర్ణయం తీసుకోలేదు. వారసత్వ హక్కులను సంబంధిత సివిల్ కోర్టులో నిరూపించుకోవాలని గతంలోనే స్పష్టం చేసింది.

### • శిష్యులకు నోటీసులు ఇవ్వలేదా? నియామకంలో నిబంధనల ఉల్లంఘన గుర్తించిన హైకోర్టు!

బ్రహ్మంగారి మఠం పీఠాధిపతి నియామక వివాదంలో 2025 మే 1న హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలు కీలక మలుపుగా మారాయి. వీలునామాలు, నామినేషన్ పత్రాల ఆధారంగా వారసత్వ హక్కులు కోరేవారు తమ హక్కులను సివిల్ కోర్టులో నిరూపించుకోవాలని, మఠాధిపతి నియామకం కోసం ధార్మిక పరిషత్‌ను ఆశ్రయించవచ్చని స్పష్టం చేసింది. 1987 చట్టంలోని సెక్షన్ 54(2) ప్రకారం అభ్యర్థుల వాదనలు పరిశీలించి, సెక్షన్ 53(2)లోని అర్హతల ఆధారంగా తగిన వ్యక్తిని ఎంపిక చేయాలని సూచించింది. ఈ ఆదేశాల నేపథ్యంలోనే వెంకటాద్రిస్వామిని తాత్కాలిక మఠాధిపతిగా నియమించారు. అయితే ఈ నియామకంలో కీలక నిబంధనలు ఉల్లంఘించారని తాజా విచారణలో పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. 1987 మఠాల పరిపాలన నిబంధనల్లోని రూల్ 8 ప్రకారం నియామకానికి ముందు అదే సంప్రదాయానికి చెందిన ఇతర మఠాల పీఠాధిపతులు, సంబంధిత మఠ శిష్యులతో సమావేశం నిర్వహించాలి. సమావేశం తేదీ, సమయం, ప్రదేశాన్ని కనీసం నెల రోజుల ముందే తెలియజేయాలి. మఠం ఖర్చుతో వార్తాపత్రికల్లో ప్రకటనలు ఇవ్వడంతో పాటు మఠం, దేవాదాయ శాఖ కమిషనర్, ప్రాంతీయ సంయుక్త కమిషనర్, డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో వివరాలు ప్రదర్శించాలి. తద్వారా శిష్యులు, ఇతర మఠాధిపతులు తమ అభిప్రాయాలు వెల్లడించే అవకాశం కల్పించాలి. కానీ వెంకటాద్రిస్వామి నియామకంలో ఈ విధానం పాటించలేదని తుర్లపాటి సాంబశివరావు కోర్టుకు తెలిపారు. తాను మఠ శిష్యుడినైనా సమావేశానికి ఎలాంటి నోటీసు అందలేదని పేర్కొన్నారు. ఈ అభ్యంతరాలను ప్రతివాదులు స్పష్టంగా ఖండించలేకపోయారని న్యాయమూర్తి గుర్తించారు. ఇతర మఠాధిపతులు సమావేశానికి హాజరుకాలేదని, మఠ శిష్యులకు కూడా సమాచారం అందలేదని తీర్పులో పేర్కొన్నారు. కమిషనర్ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన కొందరి వినతిపత్రాలు స్వీకరిస్తున్న దృశ్యాలు వీడియోలో ఉన్నప్పటికీ, వాటిని చట్టబద్ధమైన సమావేశానికి ప్రత్యామ్నాయంగా పరిగణించలేమని స్పష్టం చేశారు. అంతేకాకుండా పెద్ద కుమారుడిగా ఉండటం ఒక్కటే పీఠాధిపతి పదవికి అర్హత కాదని తేల్చిచెప్పారు. హిందూ మతం, తత్వశాస్త్రం, సంబంధిత శాస్త్రాలు, మఠ సంప్రదాయాలపై అపగాహనతో పాటు శిష్యులకు మఠ సిద్ధాంతాలను బోధించే సామర్థ్యం ఉండాలని పేర్కొన్నారు. మతపరమైన నిబద్ధత, క్రమశిక్షణ, నైతిక విలువలను కూడా పరిశీలించాలని, అవసరమైతే ఆయా రంగాల నిపుణుల అభిప్రాయాలు తీసుకోవచ్చని హైకోర్టు సూచించింది.



### • మూడు నెలల్లో కొత్త నియామక ప్రక్రియ.. పీఠాధిపతి ఎవరో తేల్చాల్సింది కమిషనరే!

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు 2026 నవంబర్ 4న కీలక ఉత్తర్వులు జారీ చేశారు. W.P. Nos.3019, 2404, 2625 of 2026తో పాటు W.P. No.33169 of 2025ను కలిపి విచారించి, జనవరి 13న ధార్మిక పరిషత్ వెంకటాద్రిస్వామిని తాత్కాలిక మఠాధిపతిగా నియమిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేశారు. ఈ వ్యవహారాన్ని దేవాదాయ శాఖ కమిషనర్‌కు అప్పగించి, 1987 చట్టంలోని సెక్షన్లు 53, 54(2), మఠాల పరిపాలన నిబంధనల ప్రకారం కొత్త నియామక ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. అభ్యర్థుల ఆధ్యాత్మిక అర్హతలను పరిశీలించి, మఠ శిష్యులకు, అదే సంప్రదాయంలోని ఇతర మఠాల పీఠాధిపతులకు నిబంధనల ప్రకారం అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు. అవసరమైతే మతం, తత్వశాస్త్రం, మఠ సంప్రదాయాలపై అపగాహన ఉన్న నిపుణుల అభిప్రాయాలు తీసుకోవచ్చని సూచించారు. ఉత్తర్వుల ప్రతిని అందుకున్న తర్వాత ప్రాధాన్యంగా మూడు నెలల్లోగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. అయితే కొత్త పీఠాధిపతి ఎంపికయ్యే వరకు వెంకటాద్రిస్వామి తాత్కాలికంగా కొనసాగేందుకు అనుమతించారు. ఆయన తరఫు న్యాయవాది అభ్యర్థన మేరకు ఈ వెసులుబాటు కల్పించారు. అంటే నియామక ఉత్తర్వులు రద్దయినా, మఠ నిర్వహణలో ఆయన కొనసాగింపును కోర్టు నిలిపివేయలేదు.

ఈ తీర్పుతో వీరభద్రస్వామి వాదనకు ప్రాధాన్యం పెరిగినా, ఆయనకు పీఠాధిపత్యం ఖరారు కాలేదు. గోవిందస్వామి నామినేషన్ వాదన కూడా తేలాల్సి ఉంది. ముగ్గురి వాదనలను పరిశీలించి చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాల్సింది కమిషనరే. వీలునామా, నామినేషన్ పత్రాల చెల్లుబాటుపై వారసులు సివిల్ కోర్టులో హక్కులు నిరూపించుకోవాలి. మఠాధిపతి ఎంపికలో ఆధ్యాత్మిక పరిజ్ఞానం, సంప్రదాయాలపై అవగాహన, శిష్యుల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. బ్రహ్మంగారి మఠం ఒక కుటుంబానికి చెందిన పదవి మాత్రమే కాదు; వేలాది భక్తుల విశ్వాసానికి ప్రతీక. కాలజ్ఞాన బోధనలు, ఆధ్యాత్మిక సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత పీఠాధిపతిపై ఉంది. అందుకే కుటుంబ పెద్దరికం కంటే అర్హతలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నది తీర్పు సారాంశం. వీరభద్రస్వామికి పీఠం దక్కుతుందా? గోవిందస్వామి నామినేషన్‌కు గుర్తింపు వస్తుందా? వెంకటాద్రిస్వామి కొనసాగింపు శాశ్వతమవుతుందా? అన్నది ఇంకా తేలలేదు. మూడు నెలల్లో చేపట్టే కొత్త నియామక ప్రక్రియే సమాధానం ఇవ్వనుంది. కుటుంబ వారసత్వంతో పాటు ఆధ్యాత్మిక అర్హతలు, మఠ సంప్రదాయాలు, శిష్యుల భాగస్వామ్యానికి ఎంత ప్రాధాన్యం దక్కుతుందో చూడాలి. వీరభద్రస్వామి వాదనకు అసలు పరీక్ష ఇప్పుడు అధికారుల ముందే జరగనుంది.




# బజార్‌లో డాక్ట‘రేట్లు’

## అనర్హులకు పట్టా ప్రదానం

**దాని వెనుకుందో పకడ్బందీ యాపారం . డబ్బుంటే చాలు.. డాక్టర్ పట్టా చేతిలో .**

**డాక్టరేట్ అంటే ఒకప్పుడు ఎంతో గౌరవం. సంవత్సరాల తరబడి పరిశోధనలు చేసి, ఎన్నో పరీక్షలు ఎదుర్కొని, ఒక నిర్దిష్ట అంశంపై లోతైన అధ్యయనం చేసిన వారికి మాత్రమే దక్కే అరుదైన విద్యా గౌరవం. మరోవైపు కళ, సాహిత్యం, సామాజిక సేవ, ఇతర రంగాల్లో విశేష కృషి చేసిన ప్రముఖులకు వారి ప్రతిభను గుర్తిస్తూ విశ్వవిద్యాలయాలు ప్రదానం చేసే గౌరవ డాక్టరేట్లు ఉండేవి. అలాంటి పురస్కారం అందుకోవడం వ్యక్తిగత ప్రతిష్ఠగానే కాకుండా, ఆ రంగానికి దక్కిన గౌరవంగా భావించేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. డాక్టరేట్ అనే పదానికి ఉన్న విలువ, విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. సందుకొకరు, గొందుకొకరు తమ పేర్ల ముందు డాక్టర్ అని తగిలించుకుని హడావిడి చేస్తున్నారు. ఎవరు నిజమైన ప్రతిభావంతులు? ఎవరు పరిశోధకులు? ఎవరు కేవలం ప్రచారకారులు? అన్నది గుర్తించలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఈ డమ్మీ డాక్టర్ల హడావిడిలో నిజమైన ప్రతిభావంతులు, పరిశోధకుల కృషి మరుగున పడుతోంది. ఒకప్పుడు ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాలు మాత్రమే ప్రదానం చేసే గౌరవ డాక్టరేట్లు ఇప్పుడు గుర్తింపు స్పష్టంగా లేని సంస్థలు, ప్రైవేటు అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థలు, కొన్ని చిన్న సంస్థల పేరుతో విచ్చలవిడిగా ప్రదానం అవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సింగపూర్, మలేషియా, శ్రీలంక వంటి దేశాల్లోని కొన్ని సంస్థల పేర్లతోనూ, దేశంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న గుర్తింపు లేని సంస్థల ద్వారానూ డాక్టరేట్లు ఇప్పిస్తామంటూ ప్రచారం సాగుతోంది. కొంత మొత్తం చెల్లిస్తే చాలు.. పట్టా చేతిలో పెట్టేస్తారనే విమర్శలు ఉన్నాయి. అద్దెకు తెచ్చుకున్న గౌన్లు, వేదికలు, ఫొటోగ్రాఫర్లు, భారీ ప్రచారంతో అవార్డుల కార్యక్రమాలను స్పాన్సర్ ఈవెంట్ల తరహాలో నిర్వహిస్తున్నారు. ఆ కార్యక్రమంలో డాక్టరేట్ అందుకున్న వ్యక్తి మరుసటి రోజు నుంచే తన పేరుకు ముందు డాక్టర్ అని చేర్చుకుని ప్రచారం ప్రారంభిస్తున్నారు. సరిగ్గా చదవలేని వారు, రాయలేని వారు సైతం డాక్టర్ బిరుదుతో హడావిడి చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ జాబితాలో కొంతమంది పాత్రికేయులు కూడా చేరడం మరింత చర్చనీయాంశంగా మారింది. డబ్బు పెట్టి బిరుదులు పొందడం, వాటిని ప్రతిభకు నిదర్శనంగా ప్రచారం చేసుకోవడం వల్ల డాక్టరేట్ అనే గౌరవ పదానికే మచ్చ పడుతోంది.**




### డాక్టరేట్ ప్రదానం చేసే అధికారం ఎవరికి?

అసలు డాక్టరేట్ పరిశోధన చేసిన వారికా? కళ, సాహిత్యం, సేవా రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారికా? లేక డబ్బు చెల్లించి, పరిచయాలు ఉపయోగించుకుని బిరుదులు పొందిన వారికా? అన్న ప్రశ్న ఇప్పుడు కీలకంగా మారింది. వాస్తవానికి డాక్టరేట్ ప్రధానంగా రెండు రకాలుగా ఉంటుంది. మొదటిది అకడమిక్ డాక్టరేట్ లేదా పీహెచ్‌డీ. ఇందులో అభ్యర్థి ఒక నిర్దిష్ట అంశంపై పరిశోధన చేయాలి. విశ్వవిద్యాలయ నిబంధనల ప్రకారం పరిశోధనా పత్రం, థీసిస్ సమర్పించాలి. సంబంధిత నిపుణుల మూల్యాంకనం, ఇతర విద్యా ప్రక్రియలను పూర్తి చేసిన తర్వాతే పీహెచ్‌డీ లభిస్తుంది. రెండోది గౌరవ డాక్టరేట్ (Honorary Doctorate). సమాజానికి లేదా ఒక ప్రత్యేక రంగానికి విశేష సేవలు అందించిన వ్యక్తుల కృషిని గుర్తిస్తూ విశ్వవిద్యాలయాలు ప్రదానం చేసే గౌరవం ఇది. ఈ రెండింటి మధ్య స్పష్టమైన తేడా ఉంది. గౌరవ డాక్టరేట్ పొందినంత మాత్రాన ఆ వ్యక్తి పీహెచ్‌డీ పరిశోధన చేసినట్లు కాదు. దానిని అకడమిక్ అర్హతగా చూపించడం కూడా సరికాదు. భారతదేశంలో డిగ్రీల ప్రదానానికి సంబంధించి 1956 నాటి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (UGC) చట్టంలోని సెక్షన్ 22 కీలకమైనది. ఈ నిబంధన ప్రకారం చట్ట బద్ధంగా స్థాపించబడిన విశ్వవిద్యాలయాలు, డీమ్డ్ యూనివర్సిటీలు, పార్లమెంటు చట్టం ద్వారా ప్రత్యేక అధికారం పొందిన సంస్థలకే నిర్దేశిత డిగ్రీలను ప్రదానం చేసే అధికారం ఉంటుంది. కేవలం సంస్థ పేరు చివర యూనివర్సిటీ అని పెట్టుకోవడం, ఒక అసోసియేషన్‌ను రిజిస్టర్ చేసుకోవడం, అంతర్జాతీయ సంస్థగా ప్రచారం చేసుకోవడం వల్ల డిగ్రీలు లేదా డాక్టరేట్లు ప్రదానం చేసే అధికారం రాదు. గౌరవ డాక్టరేట్ విషయంలోనూ సంబంధిత విశ్వవిద్యాలయ చట్టం, దాని శాసనాలు, పాలక మండలి ఆమోదం, నిర్దేశిత విధివిధానాలు కీలకం. ఒక సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో బిరుదు అందుకున్నంత మాత్రాన అది గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం ప్రదానం చేసిన గౌరవ డాక్టరేట్ అయిపోదు. అయితే కొన్ని సంస్థలు అవార్డుల ప్రదానోత్సవాలు, సన్మాన కార్యక్రమాల పేరుతో దరఖాస్తులు ఆహ్వానిస్తూ భారీగా ప్రచారం చేస్తున్నాయి. నామినేషన్ ఫీజులు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు, కార్యక్రమ నిర్వహణ ఖర్చులు వంటి పేర్లతో డబ్బులు వసూలు చేస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. సామాజిక గుర్తింపు పొందాలనే కోరిక, పేరుకు ముందు డాక్టర్ అనే పదాన్ని చేర్చుకోవాలనే ఆకాంక్షను కొన్ని సంస్థలు వ్యాపార అవకాశంగా మార్చుకుంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. సోషల్ మీడియా ప్రకటనలు, కమీషన్ ఏజెంట్ల నియామకం ద్వారా ఈ వ్యవహారం విస్తరిస్తోందనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అర్హత కంటే చెల్లింపులే ప్రమాణమైతే.. డాక్టరేట్ గౌరవం ఎలా నిలబడుతుంది?

### విదేశీ డాక్టరేట్ల పేరుతో వసూళ్లు.. రాష్ట్రాలు దాటుతున్న దందా!

డాక్టరేట్ బిరుదుల పేరుతో సాగుతున్న వ్యవహారం రెండు తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాలేదు. తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోనూ ఇలాంటి ఘటనలు వెలుగులోకి వచ్చాయి. పేరు లేని సంస్థలు తమను ఇంటర్నేషనల్ యూనివర్సిటీలుగా ప్రచారం చేసుకుంటూ సోషల్ మీడియా ప్రకటనల ద్వారా ప్రజలకు వల వేస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. విదేశీ విశ్వవిద్యాలయాల ద్వారా గౌరవ డాక్టరేట్లు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలు కూడా నమోదయ్యాయి. గతేడాది హైదరాబాద్‌లో ఒక సాంస్కృతిక సంస్థ ఏడుగురికి గౌరవ సర్టిఫికెట్లు జారీ చేసి ఒక్కొక్కరి నుంచి రూ.20 వేల చొప్పున వసూలు చేసినట్లు వార్తలు రావడంతో పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సమాచారం. మరో ఘటనలో అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల ద్వారా విదేశీ డాక్టరేట్లు ఇప్పిస్తామని రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు వసూలు చేసినట్లు కేసు నమోదైంది. తమిళనాడులోనూ గౌరవ డాక్టరేట్ల పేరుతో డబ్బులు వసూలు చేసినట్లు కేసు నమోదైంది. 2023లో అన్నా యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో సుమారు 40 మందికి గౌరవ డాక్టరేట్లు అందించారు. అయితే ఆ కార్యక్రమం తమ ఆధ్వర్యంలో జరగలేదని విశ్వవిద్యాలయం స్పష్టం చేయడంతో వ్యవహారం సంచలనంగా మారింది. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు నిర్వాహకులను పోలీసులు అరెస్టు చేసినట్లు వార్తలు వచ్చాయి. ఇదే తరహాలో మైసూరులో నకిలీ గౌరవ డాక్టరేట్ ప్రదానోత్సవం వ్యవహారంలో పోలీసుల జోక్యంతో 142 మంది నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.20 వేల నుంచి లక్ష రూపాయల వరకు వసూలు చేసినట్లు వెలుగులోకి వచ్చింది. కేరళలోని కొచ్చిలోనూ విదేశీ గౌరవ డిగ్రీల పేరుతో ఇదే తరహాలో రూ.1.20 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. ఈ ఘటనలన్నీ ఒకే రకమైనవని ముందుగానే నిర్ధారించలేం. అయితే డాక్టరేట్ అనే గౌరవ బిరుదును ఆసరాగా చేసుకుని ఆర్థిక లావాదేవీలు సాగుతున్నాయనే ఆందోళన మాత్రం పెరుగుతోంది. గౌరవ డాక్టరేట్ల వ్యవహారాని కంటే నకిలీ పీహెచ్‌డీ సర్టిఫికెట్ల సమస్య మరింత తీవ్రమైనది. ఎందుకంటే అవి విద్యార్హతలుగా చూపించి ఉద్యోగాలు, పదోన్నతులు, విద్యా రంగంలోని అవకాశాలను ప్రభావితం చేసే ప్రమాదం ఉంది. కర్ణాటకలో విద్యార్హతల ధ్రువీకరణ సందర్భంగా 249 మంది గెస్ట్ లెక్చరర్లకు సంబంధించి నకిలీ పీహెచ్‌డీ అర్హత పత్రాల వ్యవహారం వెలుగులోకి రావడం ఈ సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. ఒకవైపు నిజమైన పరిశోధకులు సంవత్సరాల తరబడి శ్రమిస్తుంటే, మరోవైపు నకిలీ అర్హత పత్రాల వ్యవహారం విద్యా వ్యవస్థ విశ్వసనీయతనే ప్రశ్నార్థకం చేస్తోంది.

### సమగ్ర విచారణ అవసరం.. లెక్కల్లోకి రాని నకిలీ బిరుదులు!

దేశంలో నిజంగా ఎన్ని నకిలీ పీహెచ్‌డీలు విక్రయించారు? ఎన్ని విశ్వవిద్యాలయాలపై ఫిర్యాదులు వచ్చాయి? ఎన్ని సంస్థలు అనుమానాస్పదంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి? ఎంతమందికి గౌరవ డాక్టరేట్ల పేరుతో బిరుదులు అందించారు? ఎన్ని కేసులు నమోదయ్యాయి? ఎన్ని కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయి? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పే సమగ్ర రాష్ట్రాల వారీ అధికారిక గణాంకాలు ప్రస్తుతం అందుబాటులో లేవు. యూజీసీ, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖలు, పోలీసు విభాగాలు, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు సమన్వయంతో పనిచేసి ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి సమాచారాన్ని ప్రజలకు అందించాల్సిన అవసరం ఉంది. కేవలం హెచ్చరికలు జారీ చేయడం, నకిలీ విశ్వవిద్యాలయాల జాబితాలు విడుదల చేయడం మాత్రమే సరిపోదు. ఆయా సంస్థలు ఎలా ఏర్పడ్డాయి? వాటి వెనుక ఎవరున్నారు? డబ్బులు ఎలా వసూలు చేస్తున్నారు? బిరుదులు పొందిన వారు వాటిని ఎక్కడెక్కడ ఉపయోగిస్తున్నారు? అన్న అంశాలపై విచారణ జరగాలి. డబ్బులు తీసుకుని డిగ్రీలు లేదా డాక్టరేట్లు ప్రదానం చేస్తున్నట్లు ఆధారాలు లభిస్తే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలి. ఉద్యోగాలు, విద్యా నియామకాల్లో నకిలీ పీహెచ్‌డీ పత్రాలు ఉపయోగించినట్లు తేలితే వాటి చెల్లుబాటును పరిశీలించి బాధ్యులపై చర్యలు చేపట్టాలి. అదే సమయంలో నిజమైన విశ్వవిద్యాలయాల పేర్లు, వాటి గుర్తింపును పోలిన పేర్లతో ప్రజలను మోసం చేసే సంస్థలపై ప్రత్యేక నిఘా అవసరం. ముఖ్యంగా సోషల్ మీడియా ద్వారా సాగుతున్న ప్రచారాలు, కమీషన్ ఏజెంట్ల వ్యవస్థ, విదేశీ డిగ్రీల పేరుతో జరుగుతున్న వసూళ్లను పరిశీలించాలి. ప్రజలు కూడా ఏదైనా డాక్టరేట్ పొందే ముందు ఆ సంస్థకు ఉన్న చట్టబద్ధమైన గుర్తింపు, డిగ్రీ ప్రదానం చేసే అధికారం, సంబంధిత విశ్వవిద్యాలయ ఆమోదం వంటి వివరాలను పరిశీలించాలి. ఒక కార్యక్రమంలో గౌన్ వేసుకుని ఫొటో దిగడం, సర్టిఫికెట్ అందుకోవడం మాత్రమే విద్యా అర్హతకు నిదర్శనం కాదు. ఈ వ్యవహారాన్ని వ్యక్తిగత ప్రతిష్ఠకు సంబంధించిన అంశంగా కాకుండా విద్యా వ్యవస్థ విశ్వసనీయతకు సంబంధించిన సమస్యగా చూడాలి. నకిలీ అర్హతలు నిజమైన ప్రతిభకు పోటీగా నిలిచే పరిస్థితి ఏర్పడితే దాని ప్రభావం ఒక్క వ్యక్తిపైనే కాదు.. మొత్తం విద్యా వ్యవస్థపైనే పడుతుంది.

### నిజమైన ప్రతిభకు అవమానం.. డాక్టరేట్ గౌరవాన్ని కాపాడాలి!

ఒక పరిశోధకుడు పదేళ్లు, పదిహేనేళ్లు ఒక అంశంపై శ్రమించి, ఎన్నో సవాళ్లను అధిగమించి పీహెచ్‌డీ సాధిస్తే ఆ పట్టాకు ప్రత్యేక విలువ ఉంటుంది. అలాగే దశాబ్దాల పాటు కళ, సాహిత్యం, సామాజిక సేవ వంటి రంగాలకు విశేష సేవలు అందించిన వ్యక్తికి విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తే అది అతని కృషికి లభించిన గుర్తింపు. అలాంటి గౌరవాలను ఎలాంటి పరిశోధన, విశేష సేవ, నిర్దిష్ట ఎంపిక ప్రక్రియ లేకుండా కేవలం ఆర్థిక లావాదేవీల ద్వారా పొందుతున్న బిరుదులతో సమానంగా చూడటం నిజమైన ప్రతిభకు అవవత్సరాల కష్టంతో సంపాదించిన గుర్తింపును, ఎలాంటి పరిశోధన లేకుండా పొందిన బిరుదుతో సమానంగా చూపించడం వ్యవస్థలోని విలువలను దెబ్బతీసే ప్రమాదం ఉందని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఓ డాక్టరేట్ పొందిన వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తింపు లేని సంస్థలు డాక్టరేట్ పేరుతో ప్రజలను

## డాక్టరేట్‌కు విలువనిచ్చేది నిజమైన కృషే

**అకడమిక్ పీహెచ్‌డీ, గౌరవ డాక్టరేట్... రెండింటికీ దేని విలువ దానికి ఉంటుంది. ఒక అంశంపై లోతైన అధ్యయనం చేసి, పరిశోధన ద్వారా కొత్త అవగాహనను అందించి, నిపుణుల మూల్యాంకనం తర్వాత సాధించే విద్యార్హత 'పీహెచ్‌డీ'. కళలు, సాహిత్యం, సామాజిక సేవ వంటి రంగాల్లో విశిష్ట కృషి చేసినవారికి విశ్వవిద్యాలయం ఇచ్చే గుర్తింపు 'గౌరవ డాక్టరేట్'. రెండోది స్వీకరించినవారు తమ పరిచయాల్లో 'గౌరవ డాక్టరేట్' అని స్పష్టంగా పేర్కొంటే ఆ పురస్కారం దక్కిన సందర్భానికీ, వారి కృషికీ తగిన గౌరవం లభిస్తుంది. ఆంగ్లంలో "Better to be honourable than honoured" అనే మాట ఉంది. 'సన్మానాలు పొందడం కన్నా గౌరవప్రదంగా జీవించడం మేలు' అని దీనర్థం. డబ్బు చెల్లిస్తే డాక్టరేట్ ఇస్తామనే ప్రకటనలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తాయి. అలాంటి ఆహ్వానం అందినప్పుడు ప్రదానం చేసే సంస్థకు ఆ అధికారం ఉందో, సంబంధిత విశ్వవిద్యాలయం తన అధికారిక వేదికపై ఆ కార్యక్రమాన్ని ప్రకటించిందో తెలుసుకోవాలి. ఫిర్యాదు వచ్చినప్పుడు ఆధారాలను పరిశీలించి, సంబంధిత సంస్థ వివరణను తీసుకున్న తర్వాతే నిర్ధారణకు రావాలి. విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్ల ఎంపిక ప్రమాణాలతో పాటు ఎవరికి, ఏ కృషికి ఆ గౌరవం ఇచ్చాయో వెల్లడిస్తే ప్రజలకు స్పష్టత వస్తుంది. నకిలీ పీహెచ్‌డీ పత్రాలను ఉద్యోగాలు, పదోన్నతుల కోసం ఉపయోగిస్తే అర్హుల అవకాశాలు దెబ్బతింటాయి. అందుకే నియామక సంస్థలు పత్రాలను జారీ చేసిన విశ్వవిద్యాలయం నుంచే వాటి ప్రామాణికతను ధ్రువీకరించుకోవాలి. మోసం నిర్ధారణైన సందర్భాల్లో బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో విశ్వవిద్యాలయాలు తమ పరిశోధన ప్రమాణాలను క్రమం తప్పకుండా సమీక్షించుకోవాలి. పరిశోధనలో స్వతంత్ర ఆలోచనకు, ఆధారాల నాణ్యతకు, నిజాయతీకి ప్రాధాన్యం ఇచ్చినప్పుడే పీహెచ్‌డీపై ప్రజల నమ్మకం నిలుస్తుంది. గౌరవ డాక్టరేట్ల ఎంపికలోనూ ఆ వ్యక్తి చేసిన పనికి, దాని ద్వారా సమాజానికి లేదా సంబంధిత రంగానికి కలిగిన మేలుకు ప్రాధాన్యం ఇవ్వాలి. పరిశోధకుడి కృషినీ, సమాజానికి విశిష్ట సేవ చేసిన వ్యక్తి కృషినీ వాటి స్వభావానికి తగిన రీతిలో గుర్తించడం మన విద్యాసంస్థల బాధ్యత. ఆ గుర్తింపు ఎలా లభించిందో ప్రజలకు తెలియజేయడం కూడా అంతే ముఖ్యం.**



డాక్టర్ వంగీపురం శ్రీనాథాచారి
పూర్వ అదనపు పరీక్షల నియంత్రణాధికారి, పూర్వ ఆంగ్ల విభాగాధిపతి, పాలమూరు విశ్వవిద్యాలయం

## నకిలీల లీల.. అసలైన అర్హుల గోల!

డాక్టరేట్ అందుకున్న వెంటనే కొందరు తమ పేర్ల ముందు డాక్టర్ అని చేర్చుకోవడం, సోషల్ మీడియా ఖాతాల్లో ప్రత్యేకంగా ప్రచారం చేసుకోవడం, భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, పత్రికల్లో ప్రకటనలు ఇవ్వడం, సన్మాన సభలు నిర్వహించడం చేస్తున్నారు. తమకు లభించిన గుర్తింపును ప్రచారం చేసుకోవడం వ్యక్తిగత స్వేచ్ఛే కావచ్చు. కానీ ఆ బిరుదు ఎవరు ఇచ్చారు? ఆ సంస్థకు ఉన్న చట్టబద్ధమైన అర్హత ఏమిటి? అది గౌరవ పురస్కారమా? అకడమిక్ డాక్టరేటా? అన్న వివరాలను దాచిపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేయడం మాత్రం తీవ్రమైన సమస్య. గుర్తింపు లేని సంస్థలు విశ్వవిద్యాలయాల పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న అంశంపై యూజీసీ పలుమార్లు హెచ్చరికలు జారీ చేసింది. అయినప్పటికీ ఈ వ్యవహారాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడలేదనే విమర్శలు ఉన్నాయి. 2026 ఫిబ్రవరి నాటి యూజీసీ జాబితా ప్రకారం దేశంలో 32 సంస్థలను నకిలీ విశ్వవిద్యాలయాలుగా గుర్తించినట్లు పేర్కొనబడింది. ఇవి 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఉన్నాయి. ఢిల్లీలో అత్యధికంగా 12 సంస్థలు, ఉత్తరప్రదేశ్‌లో నాలుగు సంస్థలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్‌లలో రెండేసి సంస్థలు ఉండగా, అరుణాచల్‌ప్రదేశ్, హర్యానా, జార్ఖండ్, రాజస్థాన్‌లలో ఒక్కో సంస్థను గుర్తించారు. ఆంధ్రప్రదేశ్‌లో క్లైస్ట్ న్యూ టెస్టమెంట్ డీమ్డ్ యూనివర్సిటీ, బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా వంటి సంస్థలు ఈ జాబితాలో ఉన్నట్లు వెల్లడైంది. నకిలీ పీహెచ్‌డీ డిగ్రీల వ్యవహారం పార్లమెంటు దృష్టికి కూడా వెళ్లింది. 2024 డిసెంబర్ 4న రాజ్యసభలో విద్యా మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం పీహెచ్‌డీ డిగ్రీల విక్రయాలకు సంబంధించి పది విశ్వవిద్యాలయాలపై యూజీసీకి ఫిర్యాదులు అందాయి. వాటిలో రాజస్థాన్‌కు చెందిన OPJS యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, మాధవ్ యూనివర్సిటీ, రాఫెల్స్ యూనివర్సిటీ, సింఘానియా యూనివర్సిటీ పేర్లు ఉన్నాయి. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ, మంగళాయతన్ యూనివర్సిటీ, మధ్యప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి యూనివర్సిటీ, జార్ఖండ్‌లోని సాయినాథ్ యూనివర్సిటీ, ఉత్తరాఖండ్‌లోని క్వాంటమ్ యూనివర్సిటీ పేర్లు కూడా ఫిర్యాదుల్లో ప్రస్తావించబడ్డాయి. అయితే మధ్యప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి యూనివర్సిటీ, ఉత్తరాఖండ్‌లోని క్వాంటమ్ యూనివర్సిటీపై వచ్చిన ఆరోపణలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పరిశీలించి నిర్దోషిగా తేల్చినట్లు పార్లమెంటరీ సమాధానంలో పేర్కొన్నారు. అంటే ఫిర్యాదులు వచ్చిన ప్రతి సంస్థను నకిలీగా నిర్ధారించలేం. ఆరోపణలు, విచారణ ఫలితాలను వేర్వేరుగా చూడాల్సిందే. అయినప్పటికీ నకిలీ విద్యాసంస్థల పేరుతో సాగుతున్న వ్యవహారాలపై సమగ్ర నిఘా అవసరం స్పష్టంగా కనిపిస్తోంది.

తప్పుదోవ పట్టిస్తున్నాయనే ఫిర్యాదులపై సంబంధిత ప్రభుత్వ విభాగాలు, విద్యాశాఖ, వినియోగదారుల రక్షణ వ్యవస్థలు, అవసరమైన సందర్భాల్లో పోలీసు యంత్రాంగం స్పందించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో చట్టబద్ధమైన విశ్వవిద్యాలయాలు కూడా గౌరవ డాక్టరేట్ ప్రదాన విధానాలను మరింత పారదర్శకంగా ఉంచాలి. ఎవరికి, ఎందుకు, ఏ రంగంలో చేసిన కృషికి గౌరవ డాక్టరేట్ ఇస్తున్నారో అధికారికంగా వెల్లడించాలి. అవార్డు పొందిన వ్యక్తి వివరాలు, ప్రదానం చేసిన తేదీ, సంబంధిత పాలక మండలి ఆమోదం వంటి సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలి. గౌరవ డాక్టరేట్‌ను అకడమిక్ పీహెచ్‌డీగా ప్రచారం చేసే సందర్భాల్లోనూ స్పష్టత ఉండేలా చర్యలు చేపట్టాలి. డాక్టరేట్లు పొందడం తప్పు కాదు. గుర్తింపు కోరుకోవడం అంతకంటే తప్పు కాదు. కానీ ఆ గుర్తింపుకు ఒక ప్రమాణం ఉండాలి. ప్రతిభకు ఒక విలువ ఉండాలి. పరిశోధనకు ఒక గౌరవం ఉండాలి. డాక్టరేట్ అనే పదాన్ని కేవలం పేరుకు ముందు చేర్చుకునే అలంకారంగా మాత్రమే చూడకూడదు. డాక్టరేట్ దేముంది.. కొనుక్కోవచ్చు అనే భావన సమాజంలో బలపడితే, నిజమైన పరిశోధకుల కృషికి విలువ తగ్గుతుంది. విద్యా వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకం దెబ్బతింటుంది. డాక్టరేట్ పొందడం అంటే దానికి తగిన అర్హత, కృషి, విశ్వసనీయత కలిగి ఉండటమే ముఖ్యం. లేదంటే రేపటి రోజున డాక్టర్ అనే సంబోధనే తన గౌరవాన్ని, ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉంది. బిరుదులు కొనుక్కోవచ్చు.. కానీ ప్రతిభను కొనలేరు. గౌరవాన్ని సంపాదించాలి.. కొనకూడదు!



# 41 ఏళ్ల వయసులో ఎర్విన్ డబుల్ ధమాకా!

**షార్జా మైదానంలో జింబాబ్వే బ్యాటర్ల వీరవిహారం..**

వయసు 41 ఏళ్లు.. కానీ బ్యాట్‌లో మాత్రం కుర్రాళ్లకు తీసిపోని జోరు! షార్జా వేదికగా అఫ్గానిస్థాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో జింబాబ్వే సీనియర్ బ్యాటర్ క్రెయిగ్ ఎర్విన్ చరిత్ర సృష్టించాడు. తన టెస్టు కెరీర్‌లో తొలి డబుల్ సెంచరీ సాధించి 206 పరుగులతో అజేయంగా నిలిచాడు. మరోవైపు ఆఫ్ స్పిన్నర్ వెస్లీ మధెవెరె కూడా బ్యాట్‌తో మెరిసి తొలి టెస్టు శతకాన్ని నమోదు చేశాడు. 100 పరుగులతో నాటౌట్‌గా నిలవడంతో రెండో ఇన్నింగ్స్‌లో జింబాబ్వే 5 వికెట్లకు 523 పరుగుల భారీ స్కోరు సాధించింది. 41 ఏళ్ల 82 రోజుల వయసులో డబుల్ సెంచరీ చేసిన ఎర్విన్.. ఈ ఘనత సాధించిన మూడో పెద్ద వయస్కుడిగా రికార్డులకెక్కాడు. గతంలో ఎరిక్ రోవన్ (42 ఏళ్ల 6 రోజులు), జాక్ హాబ్స్ (41 ఏళ్ల 195 రోజులు) మాత్రమే అతడి కంటే పెద్ద వయసులో ఈ ఘనత సాధించారు. తొలి ఇన్నింగ్స్‌లో జింబాబ్వే 504 పరుగులు చేయగా, అఫ్గానిస్థాన్ మూడు శతకాలతో 514 పరుగులు సాధించింది. రహ్మత్ షా 173, గుర్బాజ్ 113, అటల్ 105 పరుగులతో రాణించారు. షా, జియా ఉర్ రెహ్మాన్ ఎనిమిదో వికెట్‌కు 92 పరుగుల జాతీయ రికార్డు భాగస్వామ్యం నెలకొల్పారు. రెండో ఇన్నింగ్స్‌లో బ్రెండన్ టేలర్ 82 పరుగులతో రాణించాడు. సిరీస్‌లో రెండో, చివరి టెస్టు శుక్రవారం షార్జాలో ప్రారంభం కానుంది.

# హామిల్టన్‌లో కివీస్ అజేయ రికార్డుకు పరీక్ష!

**వర్షం.. తేమతో కూడిన పిచ్.. టాస్ కీలకం**



హామిల్టన్ వేదికగా భారత్‌తో జరగనున్న మూడో వన్డే న్యూజిలాండ్‌కు కీలక పరీక్షగా మారింది. సొంతగడ్డపై వరుసగా 11 వన్డే సిరీస్‌లు గెలిచిన కివీస్ విజయపరంపరకు ఇప్పుడు ముప్పు పొంచి ఉంది. ఆక్లాండ్, వెల్లింగ్టన్ పిచ్‌లపై పేసర్లకు అనుకూల పరిస్థితులు కనిపించగా, సెడ్డన్ పార్క్‌లోనూ అదే తరహా వాతావరణం ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. వర్షం కారణంగా పిచ్ సిద్ధం చేసేందుకు గ్రౌండ్స్ సిబ్బందికి తక్కువ సమయం దొరికింది. దీంతో టాస్ గెలవడం కీలకంగా మారనుంది. మరోవైపు న్యూజిలాండ్ టాస్ గెలుపులోనూ వెనుకబడింది. ఈ పర్యటనలో ఏడు మ్యాచ్‌ల్లో ఒక్కసారి మాత్రమే సాంట్నర్‌కు టాస్ కలిసొచ్చింది. విల్ యంగ్, టిమ్ సీఫర్ట్, హెన్రీ నికోల్స్, టామ్ లాథమ్ తమ స్థానాలను నిరూపించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. భారత బౌలర్లు రాణిస్తుండగా, మిడిలార్డర్ బ్యాటర్లకు పేస్ పరీక్ష ఎదురవుతోంది. తొలి రెండు వన్డేల్లో విజయాలు సాధించిన భారత్ అదే జోరును కొనసాగించాలని చూస్తోంది. వన్డే ప్రపంచకప్ సన్నాహాలకు ఈ సవాళ్లతో కూడిన పరిస్థితులు కీలక అనుభవంగా మారనున్నాయి.

# పంజాబ్ జట్టులో హార్దిక్.. కెప్టెన్సీపై సందేహాలు!

**శ్రేయస్ నాయకత్వంలో ఆడేందుకు సిద్ధమేనా?**



ఐపీఎల్ 2027కు ముందు టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ముంబై ఇండియన్స్ నుంచి పంజాబ్ కింగ్స్‌కు మారనున్నారనే వార్తలు క్రికెట్ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. ఈ ట్రేడ్‌లో పంజాబ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబైకి వెళ్లనున్నట్లు సమాచారం. అయితే ఈ ఒప్పందంపై మాజీ భారత క్రికెటర్ అభినవ్ ముకుంద్ సందేహాలు వ్యక్తం చేశారు. శ్రేయస్ అయ్యర్, యుజ్వేంద్ర చాహల్, అర్ష్‌దీప్‌లతో బలమైన కోర్ జట్టును నిర్మించిన పంజాబ్ ఇప్పుడు హార్దిక్ కోసం కీలక ఆటగాడిని వదులుకోవడం వెనుక వ్యూహమేంటని ప్రశ్నించారు. శ్రేయస్ నాయకత్వంలో హార్దిక్ సాధారణ ఆల్‌రౌండర్‌గా ఆడతారా? ఇద్దరి మధ్య జట్టు బాధ్యతల విషయంలో స్పష్టత ఉందా? అన్నది ఆసక్తికరమని వ్యాఖ్యానించారు. ముంబైకి ఈ ఒప్పందం ప్రయోజనకరంగా కనిపిస్తున్నా, పంజాబ్‌కు మాత్రం కొన్ని ప్రశ్నలు ఎదురవుతున్నాయని అభిప్రాయపడ్డారు. 2023లో ముంబైకి తిరిగొచ్చిన హార్దిక్ రోహిత్ శర్మ స్థానంలో కెప్టెన్సీ చేపట్టారు. అయితే 2024లో ముంబై అట్టడుగుకు, 2026లో తొమ్మిదో స్థానానికి పరిమితమైంది. తాజా సమాచారం ప్రకారం శ్రేయస్ నాయకత్వంలో ఆడేందుకు హార్దిక్ సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# కోహ్లీ మాటలతో వీడ్కోలుకు సిద్ధమైన విలియమ్సన్!



న్యూజిలాండ్ దిగ్గజ బ్యాటర్ కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకడంలో టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీ మాటలు కీలక పాత్ర పోషించాయట. 16 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు ఈ ఏడాది ముగింపు పలికిన విలియమ్సన్.. టెస్టుల్లో 10 వేల పరుగుల మైలురాయికి 485 పరుగుల దూరంలో నిలిచిపోయాడు. కోహ్లీ కూడా టెస్టులకు వీడ్కోలు పలికే సమయానికి ఈ ఘనతకు చేరువలోనే ఉన్నాడు. తన రిటైర్మెంట్ నిర్ణయానికి ముందు కోహ్లీతో మాట్లాడిన అనుభవాన్ని విలియమ్సన్ 'బిట్వీన్ ది టూ బీర్స్' పోడ్‌కాస్ట్‌లో పంచుకున్నాడు. కెరీర్, కెప్టెన్సీ, కుటుంబ బాధ్యతలు, ఆటలో ఎదురైన ఒత్తిళ్ల విషయంలో ఇద్దరి ప్రయాణాలు ఒకేలా సాగాయని చెప్పాడు. కోహ్లీతో సంభాషణ తనను తాను అద్దంలో చూసుకున్నట్లుగా అనిపించిందని, ఆ చర్చ తర్వాతే రిటైర్మెంట్‌కు సమయం ఆసన్నమైందని నిర్ణయించుకున్నానని వెల్లడించాడు. వ్యక్తిగత రికార్డుల కోసం తాను ఎప్పుడూ ఆడలేదని స్పష్టం చేశాడు. 9,515 టెస్టు పరుగులు, 7,256 వన్డే పరుగులు, 2,775 టీ20 పరుగులతో కెరీర్ ముగించిన విలియమ్సన్.. 10 వేల పరుగుల లక్ష్యం కంటే ఆటపై స్వచ్ఛమైన అభిరుచే తనకు ముఖ్యమని వివరించాడు.



# రామాయణంపై వర్మ ప్రశంసలు

- **వెండితెరపై అద్భుత దృశ్యకావ్యం**
- **రణ్‌బీర్ నటన, యష్ విలనిజానికి ఫిదా!**

భారతీయ ఇతిహాసం రామాయణం మరోసారి వెండితెరపై సంచలనం సృష్టిస్తోంది. దర్శకుడు నితీష్ తివారీ తెరకెక్కించిన 'రామాయణం' చిత్రంపై సినీ ప్రముఖుల ప్రశంసలు వెల్లువెత్తుతుండగా.. తాజాగా వివాదాస్పద వ్యాఖ్యలకు పెట్టింది పేరైన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తనదైన శైలిలో స్పందించి సినిమా ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారారు. ఈ చిత్రాన్ని కేవలం భక్తి ప్రధాన సినిమాగా చూడలేమని, ప్రేక్షకుల్లో భక్తిని రగిలించే మహాశక్తిగా అభివర్ణించారు. రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ నటన అద్భుతమని కొనియాడారు. ముఖ్యంగా సీత అపహరణ తర్వాత ఖాళీగా మిగిలిన ఆశ్రమంలో రాముడు నిలబడి చూసే సన్నివేశం ప్రేక్షకుల హృదయాలను కదిలిస్తుందని, ఆ బాధలోనే భవిష్యత్తు యుద్ధానికి సంబంధించిన సంకల్పం కనిపిస్తుందని విశ్లేషించారు. రావణుడి పాత్రలో యష్ ప్రత్యర్థిగా మాత్రమే కాకుండా, తన నిర్ణయంపై అచంచలంగా నిలిచే శక్తివంతమైన వ్యక్తిగా కనిపించారని ప్రశంసించారు. జటాయువు పాత్రలో అనుపమ్ ఖేర్ చూపించిన భావోద్వేగం, విరిగిన రెక్కలతోనూ పోరాటాన్ని కొనసాగించే తీరు తనను కదిలించిందన్నారు. ప్రతి ఫ్రేమ్‌లోనూ కథా గాంభీర్యం, పాత్రల భావోద్వేగాలు అద్భుతంగా ఆవిష్కృతమయ్యాయని పేర్కొన్నారు. ఇక రణ్‌బీర్ కపూర్, యష్, సాయిపల్లవి, రవిదూబే, రకుల్ ప్రీత్ సింగ్, లారా దత్తా, అరుణ్ గోవిల్ తదితరులు నటించిన 'రామాయణం పార్ట్ వన్' ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేపుతోంది. రెండో భాగం 2028లో విడుదల కానుంది.

## సీత పాత్రకు సాయిపల్లవే కరెక్ట్

**విమర్శకులకు ధనుష్ కౌంటర్**



రామాయణం వెండితెరపైకి వచ్చిందంటేనే ప్రేక్షకుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకుతాయి.. అందులోనూ సీత పాత్రలో ఎవరు కనిపిస్తారన్న ఆసక్తి సహజం. అలాంటి ప్రతిష్టాత్మక పాత్రలో సాయిపల్లవి నటించడంపై వస్తున్న విమర్శలకు ఇప్పుడు కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ తనదైన శైలిలో గట్టి సమాధానం ఇచ్చారు. నితీష్ తివారీ తెరకెక్కించిన 'రామాయణం'లో సీతగా సాయిపల్లవి ఎంపికపై సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చల నేపథ్యంలో.. తన సహనటి నటనను ఆయన బహిరంగంగా సమర్థించారు. త్వరలో విడుదల కానున్న తమ చిత్రం 'ఓం' ప్రీ రిలీజ్ వేడుకలో మాట్లాడుతూ.. సీత పాత్రలో సాయిపల్లవిని చూడటంపై ఇంత చర్చ ఎందుకో తనకు అర్థం కావడం లేదన్నారు. షూటింగ్ విరామాల్లో సైతం ఆమె ప్రార్థనల్లో నిమగ్నమై ఉండేదని, అంతటి భక్తి, స్వచ్ఛమైన మనసు ఉన్న వ్యక్తిని దేశమంతా వెతికినా మరో సీత దొరకదని ప్రశంసించారు. అందంతో పాటు అద్భుతమైన నటన ఆమె సొంతమని కొనియాడారు. 'మారి 2' సినిమా సమయంలో తొలిసారి సాయిపల్లవిని కలిసిన విషయాన్ని గుర్తుచేసుకుంటూ.. అప్పట్లో ఆమె చాలా అమాయకంగా, తక్కువగా మాట్లాడేవారని చెప్పారు. తొమ్మిదేళ్ల తర్వాత 'ఓం' సెట్స్‌లో చూసినప్పుడు ఆమె పూర్తిగా మారిపోయారని, మాటతీరు, నడక, హావభావాల్లో అద్భుతమైన ఆత్మవిశ్వాసం కనిపించిందని వెల్లడించారు. సినిమాపై సంపూర్ణ పట్టు సాధించిన నటిగా ఎదిగిన ఆమెను చూసి ఆశ్చర్యపోయానన్నారు. ధనుష్ ప్రశంసలతో సాయిపల్లవి అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది.



# రాజకీయాల్లోకి సూర్య ఎంట్రీ

- **విజయ్ బాటలో నడుస్తారా?**
- **రాజకీయాలపై స్టార్ హీరో క్లారిటీ**
- **అభిమానుల్లో ఆసక్తి రేపిన వ్యాఖ్యలు!**



సినిమా తెరపై యాక్షన్‌తో అలరించే స్టార్ హీరో సూర్య.. ఇప్పుడు రాజకీయ వేదికపైకి వస్తారా? తమిళనాట ఈ ప్రశ్న చాలాకాలంగా అభిమానుల్లో ఆసక్తిని రేపుతోంది. ముఖ్యంగా నటుడు విజయ్ రాజకీయాల్లోకి వచ్చి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన నేపథ్యంలో సూర్య రాజకీయ ప్రవేశంపై చర్చ మరింత వేడెక్కింది. అయితే ఈ ఊహాగానాలకు సూర్య తనదైన శైలిలో తెరదించారు. నవంబర్ 8న చెన్నైలో తన దీపావళి సినిమా 'సీన్' విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ప్రస్తుతానికి రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదని స్పష్టం చేశారు. 'నాకు రాజకీయాలంటే ద్వేషం లేదు. రాజకీయాలను చాలా దగ్గరగా, నిశితంగా గమనిస్తున్నాను. ఆ రంగం గురించి పూర్తిగా తెలుసుకోకుండా, దాని బాధ్యతలను అర్థం చేసుకోకుండా అడుగుపెట్టను' అంటూ తన మనసులోని మాటను బయటపెట్టారు. విద్యార్థుల ఉన్నత విద్యకు అండగా నిలుస్తున్న అగరం ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే సామాజిక సేవలో తనదైన ముద్ర వేసిన సూర్య.. రాజకీయాల్లోకి వస్తారనే అంచనాలకు ఈ వ్యాఖ్యలతో ప్రస్తుతానికి ఫుల్‌స్టాప్ పెట్టారు.

మరోవైపు విజయ్ 2024లో తమిళగ వెట్రి కళగం పార్టీని స్థాపించి, 2026 అసెంబ్లీ ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రి కావడంతో తమిళ సినీ రాజకీయాల్లో కొత్త అధ్యాయం మొదలైంది. ఇదిలా ఉంటే సూర్య నటించిన 'సీన్' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. జీతూ మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్ కామెడీ చిత్రంలో నజ్రియా నజీమ్, మలయాళ నటుడు నస్లెన్ కీలక పాత్రల్లో నటించారు. నవంబర్ 6న విడుదలైన ఈ చిత్రం తొలి మూడు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.116 కోట్ల వసూళ్లు సాధించగా, భారత్‌లో నెట్ కలెక్షన్లు రూ.62.75 కోట్లకు చేరినట్లు సాక్నిల్క్ వెల్లడించింది. రాజకీయ ప్రవేశంపై సూర్య ఇచ్చిన క్లారిటీతో పాటు బాక్సాఫీస్ విజయంతో అభిమానులకు డబుల్ ట్రీట్ దక్కింది!

# 'సీన్'కు సూపర్ బూస్ట్!

- » **సూర్య నటనకు సూపర్ స్టార్ ఫిదా**
- » **జితూ మాధవన్ టేకింగ్‌కు కితాబు**
- » **'మస్ట్ వాచ్' అంటూ మహేష్ రివ్యూ!**

బాక్సాఫీస్ దగ్గర సూర్య జోరు కొనసాగుతుంటే.. ఇప్పుడు టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రశంసలు తోడవడంతో 'సీన్' సినిమాకు మరో క్రేజీ బూస్ట్ లభించింది. మంచి సినిమాను అభినందించడంలో ఎప్పుడూ ముందుండే మహేష్.. తాజాగా ఈ క్రైమ్ కామెడీ చిత్రాన్ని



వీక్షించి తన అభిప్రాయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఎక్స్‌లో స్పందిస్తూ.. 'సీన్ చూసి ఎంతో ఎంజాయ్ చేశాను. కూల్‌గా, స్మార్ట్‌గా, ఫుల్ ఫన్‌తో సాగిన సినిమా ఇది. ఇంబరాజ్ పాత్రలో సూర్య అద్భుతంగా నటించారు. నజ్రియా, నస్లెన్ తమ పాత్రల్లో అదరగొట్టారు. దర్శకుడు జితూ మాధవన్ రచన అద్భుతం.. తెరకెక్కించిన విధానం ఆకట్టుకుంది. ప్రతి విభాగంలోనూ సినిమా ఆకట్టుకునేలా ఉంది. తప్పకుండా చూడాల్సిన చిత్రం' అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. ఇప్పటికే థియేటర్లలో ప్రేక్షకుల ఆదరణతో మంచి వసూళ్లు సాధిస్తున్న ఈ సినిమాకు మహేష్ బాబు రివ్యూ రావడం సినీ అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ముఖ్యంగా సూర్య అభిమానులకు ఇది డబుల్ ధమాకా. ఒకవైపు తమ అభిమాన హీరో నటనకు సూపర్ స్టార్ నుంచి ప్రశంసలు.. మరోవైపు థియేటర్లలో ప్రేక్షకుల సందడి.. వెరసి 'సీన్' చుట్టూ సినీ వర్గాల్లో చర్చ మరింత పెరిగింది. మహేష్ ప్రశంసలతో ఈ సినిమాను చూడాలనే ఆసక్తి కొత్త ప్రేక్షకుల్లోనూ పెరుగుతుండటంతో బాక్సాఫీస్ వద్ద సూర్య సందడి మరింత కొనసాగుతుందేమో చూడాలి!

## నితిన్ 'అలియాస్ రుక్మిణి'

# షూటింగ్ పూర్తి



టాలీవుడ్ యంగ్ హీరో నితిన్ మరోసారి ప్రేక్షకుల హృదయాలను తాకేందుకు సిద్ధమవుతున్నారు. వైవిధ్యమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఆయన తాజా చిత్రం 'అలియాస్ రుక్మిణి' ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, ప్రమోషనల్ కంటెంట్‌తో సినీ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. నేచురల్ స్టార్ నాని ప్రజెంటర్‌గా వ్యవహరిస్తుండటంతో ఈ ప్రాజెక్టుపై అంచనాలు మరింత పెరిగాయి. తాజాగా ఈ సినిమా షూటింగ్ మొత్తం పూర్తయినట్లు చిత్ర బృందం ప్రకటించింది. దీంతో సెట్స్‌పై సాగిన ప్రయాణానికి శుభం కార్డు పడగా.. ఇప్పుడు పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకులకు మరింత చేరువ చేసేందుకు నితిన్, నాని ప్రత్యేకంగా ప్రచార కార్యక్రమాలపై దృష్టి పెట్టనున్నారు. త్వరలోనే ప్రమోషన్ల సందడి మొదలుకానుంది. యూనానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై దీప్తి గంటా నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్నారు. నితిన్ సరసన ఆఫియా సయ్యద్ కథానాయికగా నటిస్తుండగా.. విజయ్ బుల్గానిన్ సంగీతాన్ని అందిస్తున్నారు. భావోద్వేగాలకు పెద్దపీట వేస్తూ తెరకెక్కుతున్న ఈ సినిమా ద్వారా నితిన్ ఎలాంటి కొత్త అనుభూతిని అందించబోతున్నారన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే పాజిటివ్ బజ్ సొంతం చేసుకున్న 'అలియాస్ రుక్మిణి' డిసెంబర్ 4న థియేటర్లలో ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి. అభిమానులకు మరో కొత్త సినిమా అనుభూతి అందించేందుకు చిత్ర బృందం సిద్ధమవుతోంది!

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.